ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 27.0

అంగన్‌వాడీ కేంద్రాలపై.. నిరంతర నిఘా

- నాణ్యతగా పౌష్టికాహారం పంపిణీ
- సమయపాలన పాటించకపోతే చర్యలు
- జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ పీడీ పి.శారద
- ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్‌కు విశేష స్పందన



ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఏలూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): 'జిల్లాలో బడికంటే మిన్నగా అంగన్‌వాడీ కేంద్రాలను అందంగా, పరిశుభ్రంగా నిర్వహణ సాగేలా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. నెలలో 15 అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేస్తున్నాను. ఎక్కడైనా సమయ పాలన పాటించక పోయినా, బాలింతలు, చిన్నారులపై దురుసుగా ప్రవర్తించినా ఉపేక్షించడం లేదు. నాణ్యతగా పౌష్టికాహారం అందిస్తున్నాం' అంటూ జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శారద పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' బుధవారం నిర్వహించిన ఫోన్‌ఇన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. పలు అంశాలపై ప్రజలు అడిగిన సందేహాలను ప్రాజెక్టు డైరెక్టర్ శారద నివృత్తి చేశారు.

- పోలవరం మండలం జగ్నన్నాథపేట అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థలో ఉండడంతో కిలోమీటరు దూరంలో ఉన్న బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లల్ని తీసుకెళ్తున్నారు. కోడిగుడ్లు చిన్నవి ఇస్తున్నారు. సూపర్‌వైజర్లు అందుబాటులో ఉండడం లేదు.

- ఆంజనేయులు, పోలవరం

ఐసీడీఎస్ పీడీ :అద్దె భవనం దొరకపోవడం వలనే బీసీ కాలనీలో కలిపి అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. గుడ్ల సైజు విషయంలో కాంట్రాక్టర్‌కు హెచ్చరిస్తాం. అందుబాటులో ఉండని సూపర్ వైజర్లను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

- ఏలూరు ఫిరంగుల దిబ్బ అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల మా అక్కకు ఆరు గుడ్లు కుళ్లినవి ఇచ్చారు. బాలింతలకు సరుకులు ఒకప్పుడు ఇంటికి ఇచ్చేవారు.. ఇప్పుడు ఇవ్వడం లేదు. కేంద్రాల్లో అధికారుల ఫోన్ నెంబర్ల బోర్డులు ఏర్పాటు చేయించాలి.

- కె.మురళి, ఏలూరు

ఐసీడీఎస్ పీడీ : కోడిగుడ్లు కుళ్లినవి అందించిన వైనంపై ఆరా తీస్తాం. ఫేస్ క్యాప్చర్ విధానంలో సరుకులను ఫేస్‌ను నమోదు చేసి బాలింతలకు ఇస్తున్నాం. రాలేని వారికి ఆయాలు వెళ్లి ఇస్తారు. ప్రతీ కేంద్రంలో సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజరు, సీడీపీవో నంబర్లు బోర్డులోనే ఉంటాయి. లేనిచోట్ల పెట్టించే ఏర్పాట్లు చేస్తాం.

- అంగన్‌వాడీల్లో చిన్నారులను చేర్పాలంటే వయస్సు ఎంత ఉండాలి?

- రాము, భీమడోలు

ఐసీడీఎస్ పీడీ : కనీసం మూడేళ్లు నిండి, ఆరేళ్లలోపు వయస్సు ఉండాలి. చిన్నారి ఆధార్, జనన ధ్రువీకరణ పత్రంతో స్థానిక అంగన్‌వాడీలో చేరవచ్చు.

- పేరంపేట రోడ్డులోని సాయిబాలాజీ టౌన్‌షిప్ ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల తవ్విన ఇంకుడుగుంత పూడ్చలేదు. గుడ్లు, పాలు ఒక సారి, బాలామృతం పౌష్టికాహారం ఇంకోసారి ఇస్తున్నారు. దీనివల్ల కేంద్రం చుట్టూ తిరగాల్సి వస్తోంది.


- వెంకటేశ్వరరావు, జంగారెడ్డిగూడెం

ఐసీడీఎస్ పీడీ : ప్రతీ కేంద్రంలో ఇంకుడు గుంతలను వర్షపు నీటి నిల్వ కోసం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వెంటనే ఆ ప్రాంతంలో గుంతకు ప్లాస్టరింగ్ చేయించేలా చూస్తాను. బాలామృతం మధ్యలో వస్తుంది. అందుకే రెండు సార్లు పంపిణీ చేస్తున్నాం.

- 2005లో బాలికా సంరక్షణ పథకం కింద పొదుపు చేసిన మొత్తాలకు మెచ్యూరిటీ తీరినా ఇంకా ఆయా మొత్తాలు జమ కాలేదు

- దీప్తి కైకలూరు

ఐసీడీఎస్ పీడీ : జిల్లాలో 542 మంది మెచ్యూరిటీ (మిగతా 8వ పేజీలో)



ఐటీడీఏ వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

పోడు భూములకు పట్టాలివ్వాలంటూ ధర్నా

బుట్టాయగూడెం, జూన్4 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో గిరిజనులు సాగు చేస్తున్న పోడు, ఎల్‌టీఆర్ భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం కేఆర్ పురం ఐటీడీఏ వద్ద ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు ధర్నా చేశారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ గిరిజనుల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. అనంతరం సమస్యలపై పీవో కె.రాములు నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజనుల డిమాండ్లపై చర్యలు తీసుకుంటానని పీవో హామీ ఇచ్చారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు 43 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్4 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ క్వాలిఫయింగ్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన ప్రథమ సంవత్సరం ఎథిక్స్, హ్యూమన్ వాల్యూస్ పరీక్షకు జిల్లాలో 66 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 23 మంది హాజరయ్యారని ఆర్ఐవో యోహాన్ తెలిపారు.

ఏలూరుకు.. మహర్దశ

ఆగిరిపల్లి మండలంలో పోలీసు అకాడమి

అమరావతి దగ్గరనే ఉన్న ఏలూరు జిల్లా రూపు రేఖలను మార్చేందుకు టీడీపీ ప్రభుత్వం శరవేగంగా నిర్ణయాలు తీసుకుంటోంది. గడిచిన నెల రోజుల్లోనే కీలక నిర్ణయాలు వెలువరించింది. ఒక వైపు పారిశ్రామీకరణతోపాటు పోలీసు అకాడమి వంటి కీలక సంస్థలు ఇక్కడికే వచ్చేలా చర్యలు చేపట్టింది.

(ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

- అనువుగా 94.47 ఎకరాల భూ కేటాయింపు
- మంత్రి వర్గం తాజా నిర్ణయం
- పారిశ్రామికీకరణకు, అంబేడ్కర్ వర్సిటీకి ఇప్పటికే సానుకూలత
- నెల రోజుల్లోనే చకాచకా నిర్ణయాలు



ఆగిరిపల్లి మండలంలో ఏర్పాటు చేయనున్న పోలీసు అకాడమికి కేటాయించిన భూములు ఇవే..

ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి సమీపంలో 94.47 ఎకరాలను పోలీసు అకాడమికి సమకూర్చేలా బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే ఆగిరిపల్లి మండలంలో ఒక్కొక్కటిగా విధాన నిర్ణయాలు తీసుకుంటూ వస్తున్న కూటమి ప్రభుత్వం ఇంతకుముందే గ్రేహౌండ్స్ దళాల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా ఇదే మండలంలో స్థల పరిశీలన చేస్తోంది. ఈ మేరకు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ చొరవ తీసుకున్నారు. ఆయన సతీమణి ధాత్రిరెడ్డి జేసీగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ వ్యవహారాల విషయంలో పోలీసులకు తోడ్పాటు అందుతూనే ఉంది. ప్రభుత్వానికి చెందిన 94.7 ఎకరాల భూమిని ఉచితంగా పోలీసు అకాడమికి బదలాయిస్తూ రెవెన్యూ యంత్రాంగం ప్రతిపాదనలు సమర్పించింది. వీటిని పరిశీలించిన రాష్ట్ర మంత్రివర్గం దీనికి అనుగుణంగానే బుధవారం అనుమతి ఇచ్చింది. దీంతో ఆగిరిపల్లి మండలంలో పోలీసు అకాడమి ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. దీంతో పాటు రాజధాని అమరావతి చేరువలో ఉండడంతో మరికొన్ని సంస్థలకు భూములు కేటాయించే అవకాశాలు లేకపోలేదు. పెదవేగి మండలం వంగూరు ప్రాంతంలో ఐఏఎస్ అధికారిణి దమయంతి 10.88 ఎకరాలను ఐ ఇనిస్టిట్యూట్‌కు భూమిని విరాళంగా ఇచ్చారు. దీనికి అయ్యే స్టాంపు డ్యూటీని మినహాయించాలని నిర్ణయించారు.

శరవేగంగా నిర్ణయాలు ..

జిల్లాలో గతంలో లేని విధంగా శరపరంపరంగా నిర్ణయాలు వెలువెడుతున్నాయి. ఈ మధ్యనే ఏలూరు సమీపాన అంబేడ్కర్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఏలూరు నగర శివారులో వట్లూరు వద్ద ఈ యూనివర్సిటీకి అనువైన భూమిని సమకూర్చాలని ఇప్పటికే నిర్ణయించారు. దీంతో పాటు చింతలపూడి సమీపంలోని పట్టాయిగూడెం వద్ద పారిశ్రామికవాడ స్థాపనకు ఈ మధ్యనే పునాది రాయి వేశారు. ఈ ప్రాంతంలో చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం ఇటీవల ఆమోదముద్ర వేసింది. రూ.150 కోట్లతో ఈ ప్లాంట్ నిర్మించబోతున్నారు. ఈ ప్రాంతంలో సుమారు 1,500 మందికి ఉపాధి అవకాశాలు దక్కబోతున్నాయి. కేవలం నెల రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోవడం గమనార్హం.

వైద్య ఆరోగ్యశాఖలో బదిలీలకు రంగం సిద్ధం

ఏలూరు అర్బన్, జూన్4 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా వైద్యఆరోగ్యశాఖలో సాధారణ బదిలీలు భారీగానే జరగనున్నాయి. దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్న వైద్యాధికారులు, అన్ని కేడర్ల సిబ్బందిని తప్పనిసరి (కంపల్సరీ)బదిలీ కింద స్థానచలనం కలిగించనున్నారు. పీహెచ్‌సీల్లో ఐదేళ్లకు పైగా ఒకేచోట పనిచేస్తున్న 11 మంది మెడికల్ ఆఫీసర్లు, ఐదుగురు సీనియర్ అసిస్టెంట్లకు తప్పనిసరి బదిలీ ఉంటుంది. వీరితోపాటు ఉమ్మడి జిల్లా (48 మండలాలు) పీహెచ్‌సీల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న 190 మంది రెగ్యులర్ ఏఎన్ఎంలకు స్థానచలనం తప్పనిసరి. డీఎంహెచ్‌వో కార్యాలయం పరిపాలనా విభాగంలో మూడేళ్లకు పైగా విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లకు బదిలీ ఖాయం. వీరందరి వెకెన్సీలను బదిలీల వెబ్‌ఆప్షన్లలో చేర్చారు. మిగతా వారంతా రిక్వెస్టు ట్రాన్స్‌ఫర్ల కింద దరఖాస్తు చేసుకోవచ్చు. కాగా ఏడేళ్లకు పైగా జిల్లా కేంద్రంలో వివిధ కేడర్లలో పనిచేసిన జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ నాగేశ్వరరావుకు నిబంధనల మేరకు బదిలీ ఖాయమైంది. ఆయన స్థానంలో భీమవరంలో డీఐవోగా పనిచేస్తోన్న డాక్టర్ డి.సుధాలక్ష్మి స్పౌజ్ కోటాలో జిల్లాకు బదిలీపై నియమితులయ్యే అవకాశం ఉంది. డాక్టర్ నాగేశ్వరరావు కె.ఆర్.పురం డిప్యూటీ డీఎం హెచ్‌వోగా బదిలీ అవుతారని ప్రచారం జరుగుతోంది. మరోవైపు స్టేట్ మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో పీహెచ్‌సీల్లో ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇటీవల జరిగిన నియామకాల్లో కొత్తగా మెడికల్ ఆఫీసర్లుగా ఉద్యోగాలు పొందిన వారికి మంగళవారం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో జిల్లా కేంద్రానికి చేరువగా వున్న వెకెన్సీలను కేటాయించడంపై ఇన్‌సర్వీసు వైద్యాధికారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముందుగా సీనియర్లకు కౌన్సెలింగ్ ద్వారా కేటాయించి ఉంటే బాగుండేదని పెదవి విరుస్తున్నారు.

బదిలీలు.. పదోన్నతుల వివాదం

- ఇద్దరు కీలక అధికారుల నిర్వాకం?
- వైద్య ఆరోగ్య శాఖలో పరిపాలనా వైఫల్యం
- జిల్లా కార్యాలయం వద్ద ఉద్రిక్తత


లోపలి పేజీలో..



కొయ్యలగూడెంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు

కూటమి శ్రేణుల సంబరాలు

కొయ్యలగూడెం/ఉంగుటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా కూటమి శ్రేణులు బుధవారం సంబరాలు జరుపుకున్నారు. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబుల ఆధ్వర్యంలో కొయ్యలగూడెంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసీపీ నిరసన కార్యక్రమాలు చేపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జనసేన సీనియర్ నేత కరాటం ఉమా, మండల జనసేన అధ్యక్షుడు తోట రవి, మండల బీజేపీ అధ్యక్షుడు గొలిశెట్టి వాసు, పట్టణ జనసేన అధ్యక్షుడు మాదేపల్లి శ్రీను, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రాజు, మండల జనసేన ఉపాధ్యక్షుడు కసుకుర్తి ఉమా, తదితరులు పాల్గొన్నారు. ఉంగుటూరు మండలం నాచుగుంటలో విజయోత్సవ సభ జరిగింది. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం ప్రజాపాలన అందిస్తోందన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఏఎంసీ చైర్మన్ కారేటి జ్యోతి, ఎంపీటీసీ గంటా ఉషారాణి,కూటమి నాయకులు పాల్గొన్నారు.



నాచుగుంటలో విజయోత్సవ సభలో మాట్లాడుతున్న ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు

20న ఏలూరు బార్ ఎన్నికలు

ఏలూరు క్రైం, జూన్4 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు బార్ అసోసియేషన్‌కు ఈనెల 20వ తేదీన ఎన్నికలను నిర్వహించనున్నారు. ఏలూరు బార్ అసోసియేషన్‌లో నమోదైన న్యాయవాదులందరూ ఈ ఎన్నికల్లో ఓటును వేయనున్నారు. ఎన్నికల ప్రధాన అధికారిగా సీనియర్ న్యాయవాది ఎంవీ నారాయణరాజు, సహాయ ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది సీహెచ్‌ఎస్ సుధీర్ వ్యవహరిస్తున్నారు. వీరిద్దరి ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించనున్నారు. బార్ అధ్యక్ష పదవికి ప్రస్తుత బార్ గౌరవాధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్, ప్రస్తుత బార్ అధ్యక్షుడు కోనే సీతారామ్, సీనియర్ న్యాయవాది వానపల్లి అప్పారావు ప్రచారం కొనసాగిస్తున్నారు. ఉపాధ్యక్ష పదవికి ప్రస్తుతం బార్ ఉపాధ్యక్షుడిగా ఉన్న సీనియర్ న్యాయవాది మాండ్రు రాజేంద్ర, ప్రధాన కార్యదర్శి పదవికి ప్రస్తుత బార్ జాయింట్ సెక్రటరీకి నోముల రాముడు, తాడేపల్లి అజిత్‌రాజ్, ప్రస్తుత బార్ ట్రెజరర్ బీవీఎస్ చింతారావు (నానాజీ), లైబ్రేరి సెక్రటరీ పదవికి ఫణి, కె.కృష్ణకిశోర్ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

In the Court of the Hon'ble Special Court For Trail and Disposal of Commercial Disputes at Vijayawada.
I.A.No. 01/2024, I.A.No. 107/2023 in C.O.S.11/2020

Between:
M/s. Unibait Feeds Pvt.Ltd.
Rep. By its Authorised Person, Gudivada -- Petitioner
And
D.M.R Aqua Feeds and Needs,
Rep. By its Managing Partner,
Mudunuri Srilakshmi and 4 others -- Respondants

1st Respondant: DMR Aqua Feeds and Needs, A Regd Partnership Firm rep byits Managing Partner, Mudunuri Srilaksmi, W/o. late Satyanarayana Raju, # 7-141, Youth Club Road, Chinnamiram, Bhimavaram Rural Mandal, West Godavari District - 534204.

2nd Respondant: Dandu Piramula Sai Krishna Raju, S/o. Mohana Murali Krishnam Raju, Working Partner of DMR Aqua Feeds and Needs R/o. Mandikodu Hamlet of Chataparru Gram Panchayat, Eluru Mandal, West Godavari Dist-534004.

3rd Respondant: Chekuri Ramanjaneya Raju, S/o. Maridi Raju, Working Partner of DMR Aqua Feeds and Needs R/o. D.No. 1-8, Magam Inavalli Mandal, E.Godavari Dist-533577.

4th Respondant: Dandu Mohana Murali Krishnam Raju, S/o. Satyanarayana Raju, R/o. Mandikodu Hamlet of Chataparru Gram Panchayat, Eluru Mandal, West Godavari Dist-534004.

5th Respondant: Dandu Mohana Murali Krishnam Raju, S/o. Satyanarayana Raju, R/o. Mandikodu Hamlet of Chataparru Gram Panchayat, Eluru Mandal, West Godavari Dist-534004.

పై నెంబరు Petitionను Petitioner U/or. 9 R-4 and U/Sec 151 of C.P.C ప్రకారము I.A.No. 107/2023 in C.O.S.No. 11/2020 ను Restore పరిపించమని కోరుచు దాఖలు చేయగా అందుపై Petitionలో Respondants 1 to 5 లకు Notice నిమిత్తం శ్రీ కోర్టు వారు ది.23-06- 2025నకు వాయిదాగా వేసి ఉన్నారు. కావున ఆ రోజు ఉ॥గ॥ 10.30 ని॥లకు Respondants 1 to 5 లు స్వయంగా కానీ, అడ్వకేట్ గారి ద్వారా కానీ పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపుకోవలెను. లేని యెడల పరోక్షమున తీర్మానించబడును.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము //
చిత్తగించవలెను
కె.వి.ఆర్.కె.రెడ్డి, పిటీషనర్ తరపు అడ్వకేట్, గుడివాడ
వాయిదా: 23-06-2025

రేపటి నుంచి మెగా డీఎస్సీ పరీక్షలు

ఏలూరు అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025 పరీక్షలు ఈనెల 6నుంచి 30వ తేదీ వరకు నిర్వహించడానికి జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసినట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. కంప్యూటర్ బేస్డ్ టెస్టు (సీబీటీ) విధానంలో నిర్వహించే ఈ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు, ఇంగ్లీషు ప్రొఫీషియన్సీ టెస్టు రోజుకు మూడు సెషన్లలో గంటన్నర నిడివి చొప్పున జరుగుతాయన్నారు. స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలు, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, దుగ్గిరాల ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లలో టెస్టు సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు కనీసం గంటముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారని, పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు వీలుగా బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్, ప్రధాన కూడళ్లలో ఫెక్సీలను ప్రదర్శనకు పెట్టామన్నారు. హాల్‌టిక్కెట్‌తో పాటు ఒరిజినల్ ఐడీ ప్రూఫ్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తప్పనిసరిగా తీసుకు రావాలని సూచించారు. సందేహాలు, వివరణల కోసం అభ్యర్థులు డీఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు 90307 23444, 95056 44555లలో సంప్రదించాలని కోరారు.

ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

మెగా డీఎస్సీ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం కలెక్టర్ వెట్రిసెల్వి సంబంధిత శాఖల అధికారులతో టెలీకాన్ఫరెన్సులో సమీక్షించారు. మొత్తం 17,584 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే 106 మంది దివ్యాంగులకు సహాయకులను (స్క్రైబ్) ఏర్పాటు చేసేవిషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షకు ముందురోజునే గురువారం ఆయా పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు చేరుకునేందుకు ఏర్పాటు చేసిన బస్సు సౌకర్యాలను పరిశీలించాలని డీఈవో, ఆర్టీవో, ఎస్ఐసీ డీఐవో, విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. హాల్‌టిక్కెట్లలో ఏవైనా చిన్నతప్పు లుంటే ఎక్కడ తప్పు నమోదైందో దానికి సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్‌ను చూపించి, జిరాక్స్ కాపీని అందజేసి పరీక్షకేంద్రం వద్దే సరిచేసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఇలా తప్పులు సరిచేయించుకునేవారు గంటన్నర ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు, డీఆర్వో విశ్వేశ్వరరావు, విద్యుత్ ఎస్ఈ సాల్మన్‌రాజు, డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, ఆర్టీసీ డీపీటీవో వరప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

కొప్పులవారిగూడెం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

పెదవేగి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం కొప్పులవారిగూడెం సర్పంచ్ చలపాటి మణి చెక్ పవర్ రద్దుచేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధులను సర్పంచ్ దుర్వినియోగం చేసినట్టు వచ్చిన ఆరోపణలపై ఏలూరు డీఎల్‌పీవో చంద్రశేఖర్ గతనెలలో విచారణ జరిపి రూ.10,03,079 మేర నిధులు దుర్వినియోగమైనట్టు గుర్తించారు. డీఎల్‌పీవో నివేదిక ఆధారంగా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు డీపీవో కె.అనూరాధ చెక్‌పవర్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. చెక్‌పవర్ రద్దు ఉత్తర్వులను సర్పంచ్ మణికి అందించామని ఈవోపీఆర్డీ అమీర్ షరీఫ్ తెలిపారు. అప్పటి ఇన్‌చార్జ్ కార్యదర్శి వరప్రసాద్‌పై వచ్చిన ఆరోపణలపై షోకాజ్ నోటీస్ జారీ చేశామని ఆయన వివరించారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (Union Bank of India)
కామయ్యపాలెం బ్రాంచి (06451) , కామయ్యపాలెం
జీలుగుమిల్లి మండలం, ఏలూరు జిల్లా, ఫోన్ నెం.93245 06451

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియజేస్తూ ప్రకటన (30 రోజుల నోటీసు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క నిబంధన 6(2)/8(6) ప్రకారం)

విషయము : సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద బ్యాంకు వారికి గల బకాయిలను తిరిగి రాబట్టుకునేందుకు ఈ క్రింది తెలిపిన ఋణగ్రహీత / హామీదారుల వారికి చెందిన ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క సెక్యూర్డ్ క్రెడిటార్, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 లోని సెక్షన్ 13(2) క్రింద **దిగువ తెలిపిన డిమాండ్ నోటీసులలో** అందు లోని నిర్ణీత గడువులోగా బకాయి చెల్లించవలసినదిగా మిమ్మల్ని కోరారు. నిర్దేశిత కాల వ్యవధిలోగా సదరు నోటీసు ను పాటించుటలో మీరు విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8 తో చదువబడే చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద స్థిర సెక్యూర్డ్ ఆస్తులను **దిగువ తెలిపిన తేదిలలో అధీకృత అధికారి స్వాధీనం** చేసుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తిని స్వాధీనం చేసుకున్న తరువాత కూడా బ్యాంకునకు బకాయి ఉన్న మొత్తం మీరు చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు అందిన తేది నుండి 30 రోజుల తరువాత ఆన్‌లైన్ విధానం ద్వారా బహిరంగ వేలం నిర్వహించడం ద్వారా దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించుట తప్పనిసరి అయినది. ఈ వేలం నిర్వహించబడుతున్న ఆస్తి రిజర్వు ధర మరియు సర్వీస్ ప్రొవైడర్ వివరాలతోపాటు ఇ-వేలం తేది మరియు సమయం మీకు విడిగా తెలియచేయబడును.

అందువలన అమ్మకం ప్రకటన ప్రచురణ తేదికి ముందుగా బ్యాంకునకు అయిన వ్యయాలు మరియు ఛార్జీలు, ఖర్చులు తదుపరి వడ్డీతో పాటు బ్యాంకునకు ఉన్న బకాయి మొత్తం మీరు చెల్లిస్తే ఆస్తి అమ్మకం కోసం తదుపరి చర్య చేపట్టడం జరుగదు. మరియు చట్టంలోని సెక్షన్ 13(8)లో నిర్దేశించిన విధంగా మీ ఆస్తిని మీరు విడిపించుకోవచ్చును.

ఋణగ్రహీతలు/ సహ-పూచీదారులు/ హామీదారులు మరియు షెడ్యూలు ఆస్తి వివరములు

1) **ఋణగ్రహీత, కో-అప్లికెంట్ మరియు హామీదారుల పేర్లు మరియు చిరునామా : 1) శ్రీ మండపాటి పార్థసారథి, తండ్రి : రామచంద్రరావు,** అక్కంపేట గ్రామం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా, ఆం.ప్ర.-534447. **2) శ్రీమతి మండపాటి కోమలి కోటేశ్వరి @ మండపాటి కోటేశ్వరి, భర్త: మండపాటి పార్థసారథి,** అక్కంపేట గ్రామం, జంగారెడ్డి గూడెం మండలం. ఏలూరు జిల్లా, ఆం.ప్ర. -534447

డిమాండ్ నోటీసు తేది : 03.04.2021 — **స్వాధీనత తేది : 19.06.2021**

స్థిరాస్తి వివరములు : పశ్చిమ గోదావరి జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం గ్రామ సమీప డోర్ నెం.16-1-3, ఆర్.యస్.నెం.133 లోని 390 చ.గ.లు విస్తీర్ణం గల ఖాళీ రెసిడెన్షియల్ స్థలము ఋణగ్రహీత శ్రీ మండపాటి పార్థసారధి గారికి చెందిన ఆస్తినకు **హద్దులు : తూర్పు :** కురెళ్ళ వరలక్ష్మి మొదలగు వారి 65 అడుగులు స్థలము, **దక్షిణం :** పంచాయితీ రోడ్డు-53 అడుగులు, **పడమర :** బందారు గంగరాజు, ఎమ్.కోమలి కోటేశ్వరి మొదలగు వారి 65 అడుగులు స్థలము మరియు ఇల్లు, **ఉత్తరం :** తటవర్తి చలమయ్య గారి ప్రహారీ గోడ - 55 అడుగులు.

2) **ఋణగ్రహీత(లు), కో-అప్లికెంట్ మరియు హామీదారుల పేర్లు మరియు చిరునామా : 1) శ్రీమతి మండపాటి కోమలి కోటేశ్వరి @ మండపాటి కోటేశ్వరి, భర్త: మండపాటి పార్థసారథి,** అక్కంపేట గ్రామం, జంగారెడ్డిగూడెం మండలం, ఏలూరు జిల్లా., ఆం.ప్ర.-534447. **2) శ్రీమతి మండపాటి పార్థసారథి, తండ్రి : రామచంద్రరావు,** అక్కంపేట గ్రామం, జంగారెడ్డి గూడెం మండలం. ఏలూరు జిల్లా, ఆం.ప్ర. -534447

డిమాండ్ నోటీసు తేది : 03.04.2021 — **స్వాధీనత తేది : 19.06.2021**

స్థిరాస్తి వివరములు : ఆస్తి నెం.1 : పశ్చిమ గోదావరి జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం గ్రామ సమీప డోర్ నెం.24-68 (20-6-15), ఆర్.యస్.నెం.283/1 లోని 331.5 చ.గ.లు విస్తీర్ణం గల ఖాళీ రెసిడెన్షియల్ స్థలము శ్రీ మండపాటి కోమలి కోటేశ్వరి @ మండపాటి కోటేశ్వరి గారికి చెందిన ఆస్తినకు **హద్దులు : తూర్పు :** లంకా లలితాదేవి గారి స్థలము - 57 అడుగులు, **దక్షిణం :** వీరంకి రాజు గారి 45.6 అడుగులు స్థలము, **పడమర :** 4 గజములు వెడల్పు 60 అడుగులు రోడ్డు, **ఉత్తరం :** 6 గజములు వెడల్పు 56.6 అడుగులు రోడ్డు.

ఆస్తి నెం.2 : పశ్చిమ గోదావరి జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం గ్రామ సమీప డోర్ నెం.24-68 (20-6-16), ఆర్.యస్.నెం.283/1 లోని 125 చ.గ.లు విస్తీర్ణం గల ఖాళీ రెసిడెన్షియల్ స్థలము శ్రీ మండపాటి కోమలి కోటేశ్వరి @ మండపాటి కోటేశ్వరి గారికి చెందిన ఆస్తినకు **హద్దులు : తూర్పు :** సొంత స్థలము-51 అడుగులు, **దక్షిణం :** నున్న కృష్ణారావు గారి ఇల్లు - 21.1 అడుగులు, **పడమర :** మండపాటి కోమలి కోటేశ్వరి గారి 51 అడుగులు స్థలము, **ఉత్తరం :** 6 గజములు వెడల్పు మార్గము - 22.1 అడుగులు.

ఆస్తి నెం.3 : పశ్చిమ గోదావరి జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం గ్రామ సమీప డోర్ నెం.24-68 (20-6-17), ఆర్.యస్.నెం.283/1 లోని 96 చ.గ.లు విస్తీర్ణం గల ఖాళీ రెసిడెన్షియల్ స్థలము శ్రీ మండపాటి కోమలి కోటేశ్వరి @ మండపాటి కోటేశ్వరి గారికి చెందిన ఆస్తినకు **హద్దులు : తూర్పు :** కొంచాడ చాముండేశ్వరి గారి స్థలము-51 అడుగులు, **దక్షిణం :** నున్న కృష్ణారావు గారి ఇల్లు - 21.1 అడుగులు, **పడమర :** సొంత స్థలము- 51 అడుగులు, **ఉత్తరం :** 6 గజములు వెడల్పు మార్గము - 14 అడుగులు.

ఆస్తి నెం.4 : పశ్చిమ గోదావరి జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం గ్రామ సమీప డోర్ నెం.24-21 (20-6-18), ఆర్.యస్.నెం.133 లోని 54 చ.గ.లు విస్తీర్ణం గల ఖాళీ రెసిడెన్షియల్ స్థలము శ్రీ మండపాటి కోమలి కోటేశ్వరి @ మండపాటి కోటేశ్వరి గారికి చెందిన ఆస్తినకు **హద్దులు : తూర్పు :** కురెళ్ళ వరలక్ష్మి మరియు రాంబాబు గార్ల స్థలము మరియు ఇల్లు - 16 అడుగులు, **దక్షిణం :** బందారు గంగరాజు గారి స్థలము-35.6 అడుగులు, **పడమర :** బుట్టాయిగూడెం రోడ్డు - 12 అడుగులు, **ఉత్తరం :** కురెళ్ళ వరలక్ష్మి మరియు రాంబాబు గారి స్థలము మరియు షాపులు - 34 అడుగులు.

తేది : 02.06.2025, ప్రదేశం : కామయ్యపాలెం — **సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**


దెందులూరు మండలం కొవ్వలిలో గ్రామదీప్ ట్రస్ట్ నాటిన మొక్కలు


పాలకోడేరులో మంచినీటి పథకం ఆవరణలో పెంచిన మొక్కలు


గణపవరం చెరువు గట్టుపై చెట్టుకింద జనం


ముదినేపల్లిలో వెంకటేశ్వరరావు ఇంటి ఆవరణలో పెంచిన మొక్కలు

పచ్చదనం
పర్యావరణ హితం

పర్యావరణం అనగానే పచ్చదనం మదిలో మెదులుతుంది. సకల జీవ రాశుల మనుగడ పర్యావరణంపై ఆధారపడి ఉంది. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణం పరిరక్షించుకోవచ్చు. ఆధునిక జీవనశైలితో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతున్న నేపథ్యంలో స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు మొక్కల పెంపకం చేపడుతున్నారు. నేడు ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా..


అమెరికా పర్యటనలో వెలమాటి మనోహరి


ఇంటి ఆవరణలో మొక్కలతో వెంకటేశ్వరరావు దంపతులు


వెలివర్రులో ఇంటి వద్ద మొక్కలతో రుద్రరాజు పుల్లంరాజు

డాక్టర్ వృత్తి వదిలిన మనోహరి

దెందులూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ, స్వగ్రామం అభివృద్ధికి డాక్టర్ వృత్తిని వదులుకున్నారు గ్రామ దీప్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ వెలమాటి మనోహరి. కొవ్వలి గ్రామానికి చెందిన మనోహరి 2015 నుంచి దాతలు, ప్రభుత్వ, ఇతర సంస్థలు, విద్యాసంస్థలను భాగస్వామ్యం చేసుకుంటూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా చెట్లను నాటి దాతలకు దత్తత ఇస్తున్నారు. కొవ్వలి తాగునీటి పైలెట్ ప్రాజెక్టులలో స్థానికులను భాగస్వామం చేసి అరుదైన మొక్కలను నాటించారు. కొవ్వలిలో పార్కులు, బహిరంగ ప్రదేశాలను పచ్చగా ఆహ్లాదంగా మార్చారు. 2021లో ఏపీ రాష్ట్ర జీవవైవిధ్య సంరక్షరాలిగా పురస్కారాన్ని అందుకున్నారు. 2024లో ప్రపంచ ప్రఖ్యాత అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కిలీ విశ్వవిద్యాలయం పర్యావరణ పరిరక్షణ నాయకత్వ శిక్షణ కార్యక్రమానికి మనోహరి పాల్గొన్నారు. గ్రామదీప్ బృందం సుమారు 3 వేల మంది సైన్యం తయారు చేశారు. గ్రామాల్లో చెరువులను కాపాడంతో పాటు ప్లాస్టిక్ వాడకుండా గ్రామాల్లో నిత్యం ప్రజలకు గ్రామస్తులకు అవగాహన కలిగిస్తూ మనోహరి పర్యావరణ ప్రేమికురాలుగా పేరు పొందారు.

చిరుద్యోగి.. పెద్ద మనసు

పాలకోడేరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆయన ట్యాంక్ వాచర్... ఇంటిని శుభ్రం చేసుకున్నట్లు ఆయన పని చేస్తున్న ట్యాంక్ పరిసరాలు మొక్కలతో పచ్చగా అందంగా తీర్చిదిద్దారు. పాలకోడేరు మంగయ్యచెరువు వద్ద ఆళ్ల రమణ 2016 నుంచి ట్యాంక్ వాచర్‌గా పని చేస్తున్నారు. ట్యాంక్ వాచర్‌గా మొదటి జీతం రూ. 5 వేలతో కొన్ని మొక్కలు కొనుగోలు చేసి నాటారు. అప్పటి నుంచి ప్రతి నెలా అతని జీతంలో నుంచి రూ.వెయ్యి ఖర్చు చేసి ట్యాంక్ చుట్టూ ఇండోర్ క్రోటన్స్, తమలపాకు, నల్లేరుకార, గ్రీన్ మ్యాట్, డ్రాగన్ ఫ్రూట్స్, వివిధ రకాల మందార మొక్కలు, సైకార్స్ గుత్తిపూలు, పిల్ల గన్నేరు, సరస్వతి ఆకు, మధువతి పాదు.. ఇలా అనేక మొక్కలను నాటారు. భవిష్యత్‌లో వాటర్ ట్యాంక్ ప్రాంతమే కాకుండా మంచినీటి చెరువు చుట్టూ మొక్కలు పెంచుతానని అంటున్నారు. వాటర్ ట్యాంక్ వద్ద పెంచుతున్న చెరకు సుమారు 35 అడుగుల ఎత్తు పెంచుతూ గిన్నిస్ బుక్ రికార్డ్ సాధించాలన్నదే తన లక్ష్యమని అని ఆళ్ల రమణ అంటున్నారు.

వృక్ష ప్రేమికుడు అల్లూరి గంగరాజు

గణపవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో మొక్కలు కీలకపాత్ర పోషిస్తాయంటున్నారు వృక్ష ప్రేమికుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు అల్లూరి గంగరాజు. గణపవరానికి చెందిన అల్లూరి గంగరాజు ఒకసారి ఎండలో సైకిల్‌పై వెళుతూ దారిలో నీడలో సేద తీరే అవకాశం లేక ఇబ్బంది పడ్డారు. అప్పుడే అవకాశం ఉన్నట చోట్లా మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నారు. 30ఏళ్లుగా తాను టీచర్‌గా పనిచేసిన ప్రాంతాల్లో వందలు, వేల మొక్కలు నాటారు. గణపవరంలో 2015లో డ్రెయిన్ తవ్వకాల సందర్భంగా 250 చెట్లను కూల్చేయడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. లోటు భర్తీ చేయడానికి మొక్కలు నాటారు. వాటిలో ఇటీవల 150 మొక్కలు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు.

పచ్చని యార్లగడ్డ కుటుంబం

ముదినేపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతో ముదినేపల్లిలోని ఓ కుటుంబం పచ్చదనం పెంచుతోంది. ఇంటి ఆవరణతో పాటు పరిసరాల్లో వివిధ రకాల మొక్కలు నాటారు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు. ఇంటి ఆవరణ చెట్లు, మొక్కలతో ఆహ్లాదకరంగా ఉంటుంది. బయట కూడ నీడనిచ్చే మొక్కలు, అందమైన పుష్పాల మొక్కలను పెంచారు. వారి ఇంటికి వెళ్లగానే నర్సరీలో ఉన్న అనుభూతి కలుగుతుంది.

ఉండి: మండలంలోని వెలివర్రులో రుద్రరాజు పుల్లంరాజు, బాలా త్రిపుర సుందరి దంపతులు మొక్కల ప్రేమికులు. వారి ఇంటి ఆవరణలో అనేక రకాల పూలు, పండ్ల మొక్కలు కనిపిస్తాయి. ఇంటికి వెళ్లిన వారు మొక్కలను చూసి ఆ దంపతులను అభినందించకుండా ఉండలేరు.


వాటర్ ట్యాంక్ వద్ద మొక్కలు పెంచిన రమణ


గణపవరంలో మొక్కలు నాటుతున్న గంగరాజు


పచ్చదనంతో ఆహ్లాదపరుస్తున్న కొవ్వలి గ్రామం

హరిత ఏలూరు జిల్లా లక్ష్యం



కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో 4.50 లక్షల మొక్కలు నాటాలన్నది లక్ష్యమని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. బుధవారం వివిధ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వనం-మనం కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులను, స్వచ్ఛంద సంస్థలను అన్ని వర్గాలను భాగస్వాములను చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. హరిత ఏలూరు జిల్లా లక్ష్యంగా అందరూ కృషి చేయాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో జేసీ కలెక్టర్ పి ధాత్రిరెడ్డి, డీఆర్వో వి విశ్వేశ్వరరావు, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు గేట్లు తనిఖీ చేయండి

ఏలూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రాజెక్టు గేట్లు తనిఖీచేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. తమ్మిలేరు, ఎర్రకాలువ, కొవ్వాడ కాల్వ మూడు ప్రాజెక్టులకు సంబంధించిన జలవనరుల శాఖ ఇంజనీర్లతో కలెక్టర్ బుధవారం సమీక్షించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు, వధూవరులుగా అలంకృతులైన స్వామి, అమ్మవార్లు

ఈడూరులో వరాల వెంకన్న కల్యాణోత్సవాలు

అత్తిలి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఈడూరులో వరాల వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున సుప్రభాతసేవ, మేలుకొలుపు, తోమాల సేవ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించారు. పడాల వెంకటేశ్వరరావు దంపతులు శేష వస్త్రాలు సమర్పించారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న అర్చకులు, పండితులు

ద్వారకాతిరుమల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. త్రయాహ్నిక దీక్షతో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయాన్ని పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటిబోదెలతో అలంకరించారు. అనంతరం అమ్మవారిని విశేష పుష్పమాలలతో అలంకరించారు. గణపతి పూజ, సర్వతో భద్రమండలి ఆరాధన, మూలమంత్ర అనుష్టానం, హోమాలను ఆలయ అర్చకులు పుసులూరి భైరవస్వామి నేతృత్వంలో నిర్వహించారు.


సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ సందీప్, పాల్గొన్న అధ్యాపకులు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌కు ఉజ్వల భవిష్యత్

నరసాపురం రూరల్ జూన్4(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌కు మంచి భవిష్యత్ ఉందని డాక్టర్ వి.సందీప్ తెలిపారు. సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్‌టీయూకే ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నానో టెక్నాలజీ విభాగం అప్లికేషన్స్ సభలో బుధవారం ఆయన మాట్లాడారు. ఎలక్ట్రికల్ వాహనాల పరిణామం, నానో టెక్నాలజీ ఆధారిత వినియోగాలు అంశంపై ఆయన అధ్యాపకులతో చర్చించారు. సాంకేతిక సబ్జెక్టులకే కాకుండా పరిశోధన సంస్కృతి పెంచేందుకు పలు అంశాలు వివరించారు. విద్యా సంస్థల మధ్య ఒప్పందాలు, ప్రాముఖ్యతపై 40 మంది అధ్యాపకులు, పరిశోధకులు సమావేశంలో పాల్గొన్నారు. అంతకు ముందు రెండో రోజు ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌కు నానో టెక్నాలజీ అప్లికేషన్లు అంశంపై మాట్లాడారు. సమావేశంలో డాక్టర్ ఎస్.సుమతి, వై.వెంకటేశరావు కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. స్వర్ణాంధ్ర సంస్థల ఛైర్మన్ కేవీ.సత్య నారాయణ, ట్రెజరర్ కేవీ.స్వామి, డైరెక్టర్ శ్రీహరి, ప్రిన్సిపాల్ ఎస్.సురేష్ కుమార్ వైస్ ప్రిన్సిపాల్ గోపిచంద్, తదితరులు ప్రోత్సాహాన్ని అందించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్..
ఎవరికి ఇవ్వాలి..!


వైసీపీ హయాంలో బకాయిలపై ఆరా

- ఇప్పటికే విద్యార్థులు చెల్లిస్తే తల్లిదండ్రుల ఖాతాలో జమ
- లేకుంటే కళాశాలల ఖాతాలకు చెల్లింపు
- వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం
- సచివాలయాలకు మార్గదర్శకాలు
- మొత్తం బకాయి రూ.150 కోట్లు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న కళాశాలలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫీజు బకాయిలను ఎవరి ఖాతాలో వేయాలనే విషయంపై ఆరా తీస్తోంది. సచివాలయాలకు మార్గదర్శకాలు విడుదల చేసింది. విద్యార్థులు ఇది వరకే కళాశాలలకు చెల్లించినట్టయితే వారి తల్లిదండ్రుల ఖాతాలో జమ చేయనున్నారు. ఫీజు చెల్లించకపోతే కళాశాలల ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గత ప్రభుత్వంలో మూడు విడతల బకాయిలు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఎన్నికల ముందు ఏడాది మూడు నెలల ఫీజును మాత్రమే నాటి ప్రభుత్వం తల్లుల ఖాతాలో జమ చేసింది. మరో మూడు విడతలు బకాయి పెట్టింది. మొత్తం కలిపి అప్పట్లోనే రూ. 75 కోట్లు చెల్లించాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కళాశాలలకు ఫీజులను పెంచింది. వైసీపీ హయాంలో కక్షపూరితంగా నిలిపివేసిన కళాశాలలకు మాత్రం ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కూడా న్యాయం జరగలేదు. జిల్లాలో ఇలా రెండు ఇంజనీరింగ్ కళాశాలలకు అన్యాయం జరిగింది. మిగిలిన ఇంజనీరింగ్ కళాశాలలకు ఫీజు పెరిగింది. తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలోనూ ఏడాది విద్యా సంవత్సరం పూర్తయ్యింది. పెంచిన ఫీజులతో కలిపి ప్రతి మూడు నెలలకు జిల్లాలో రూ.30 కోట్లు చెల్లించాలి. ఏడాదికి రూ. 120 కోట్లు జమ చేయాలి. ఒక్క విడతకు మాత్రం పూర్తిస్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేశారు. రెండో విడతలో 50శాతం మాత్రం చెల్లించారు.

కళాశాలల ఖాతాకే..

ప్రస్తుత ప్రభుత్వం కళాశాలల ఖాతాలకే ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చేస్తోంది. తద్వారా విద్యార్థులకు కూడా ఇబ్బందులు తొలగిపోయాయి. ప్రభుత్వం ఫీజు విడుదల చేయకపోతే విద్యార్థులే కళాశాలలకు చెల్లించేవారు. లేదంటే సర్టిఫికెట్‌లు ఇవ్వకుండా కళాశాలలు ఫీజులు వసూలు చేసేందుకు మల్లగుల్లాలు పడేవి. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు సర్టిఫికెట్‌లు తీసుకోవాలన్నా.. ఉన్నత చదువులకు వెళ్లాలన్నా అప్పు చేసి ఫీజులు చెల్లించేవారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కళాశాల ఖాతాల్లో జమ చేస్తోంది, దీనివల్ల బ్యాంకు ఖాతాల నుంచి సొమ్ములు తెచ్చుకుని కశాలలకు చెల్లించే ఇబ్బందులను విద్యార్థులు అధిగమించారు. సర్టిఫికెట్‌ల విషయంలో విద్యార్థులకు అవరోధాలు కల్పించవద్దంటూ కూటమి ప్రభుత్వం కళాశాలలకు ఆదేశాలు జారీచేసింది.

బకాయిల కోసం ఎదురుచూపులు

గత ప్రభుత్వంలో దాదాపు రూ.75 కోట్లు చెల్లించాలి. కూటమి ప్రభుత్వం ఫీజులు పెంచడంతో మూడు విడతల బకాయిలను మరో రూ. 75 కోట్లు జమ చేయాలి. జిల్లాలో పాత, కొత్త బకాయిలు మొత్తం రూ.150 కోట్లు విడుదల చేయాలి. కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చేస్తారన్న సానుకూల నిర్ణయం తీసుకోవడంతో యాజమాన్యాలకు ఊరట కలిగింది. విద్యార్థుల అవస్థలు తొలగిపోయాయి. పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోవడంతో యాజమాన్యాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. అప్పులు తెచ్చి వేతనాలు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం సొమ్ము విడుదల చేస్తుందని ఎదురు చూస్తున్నారు. గత బకాయిలపై వివరాలు సేకరిస్తున్నారు. వాటిని విడుదల చేయాలంటే కాలాతీతం అవుతోంది. అటు విద్యార్థులు, ఇటు కళాశాలల నుంచి వివరాలు సేకరించాలి. అప్పటి వరకు బకాయిలు పెండింగ్‌లో ఉంటాయి. లెక్క తేలిన తర్వాతే ఎవరి ఖాతాలో జమ చేయాలన్నది ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఫీజు చెల్లించినట్టయితే తల్లిదండ్రులు ఖాతాలో, చెల్లించని విద్యార్థులకు సంబంధించి కళాశాలల ఖాతాలో బకాయిలను జమ చేస్తుంది. అప్పటిదాకా ప్రస్తుత ప్రభుత్వంలో బకాయిలను చెల్లిస్తే ఆర్థికంగా కాస్త వెసులు బాటు ఉంటుందని యాజమాన్యాలు ఆశిస్తున్నాయి. కళాశాలల ఖాతాలో జమ కానుండడంతో విద్యార్థుల నుంచి వసూలు చేసే పరిస్థితి లేదు. దాంతో ప్రభుత్వంపైనే ఇప్పుడు కళాశాలలు ఆధారపడుతున్నాయి.

బదిలీలు.. పదోన్నతుల
వివాదం
ఇద్దరు కీలక అధికారుల నిర్వాకం?


ఏలూరులో జిల్లా వైద్యాధికారి కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు

- వైద్య ఆరోగ్య శాఖలో పరిపాలనా వైఫల్యం
- ఉద్యోగుల మధ్య చిచ్చు పెట్టిన అధికారులు
- ఏలూరు జిల్లా కార్యాలయం వద్ద ఉద్రిక్తత
- 8న పదోన్నతులిచ్చేందుకు ప్రతిపాదన
- కోర్టును ఆశ్రయించేందుకు యత్నాలు

ఏలూరు అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఇద్దరు కీలకాధికారుల నిర్వాకం ఏఎన్‌ఎంలు, విలేజ్ హెల్త్ అసిస్టెంట్ల మధ్య వైషమ్యాలకు దారితీసింది. సచివాలయాల్లో పనిచేసే గ్రేడ్-3 ఏఎన్‌ఎంలను వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోకి చేర్చి ఎంపీహెచ్ఏ(ఫిమేల్) ఉద్యోగులుగా పదోన్నతులివ్వడానికి సుమారు నెలరోజుల క్రితం ప్రభుత్వం అనుమతించింది. ప్రభుత్వ ఆదేశాల అమలులో తాత్సారంతో ఈ పరిస్థితి నెలకొంది. సాధారణ బదిలీలకోసం ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న రెగ్యులర్ ఏఎన్‌ఎంలు బదిలీస్థానాల ఎంపికలో నష్టాన్ని అడ్డుకునేందుకు భైఠాయించారు. పదోన్నతి అభ్యర్థుల వాదోపవాదాలతో బుధవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. పదోన్నతి కౌన్సెలింగ్‌కోసం విలేజ్ హెల్త్ సెక్రటరీలు(గ్రేడ్-3 ఏఎన్‌ఎంలు), దానికంటే ముందుగా మార్గదర్శకాలమేరకు బదిలీలు చేపట్టాలని రెగ్యులర్ ఏఎన్‌ఎంల ఆందోళన, ధర్నాలతో హోరెత్తించారు.

కార్యాలయ సిబ్బంది వద్దని వారిస్తున్నా..

ఉమ్మడి జిల్లాలో మొత్తం 256మంది గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు ఎంపీహెచ్ఏ (ఫిమేల్) ఉద్యోగులుగా పదోన్నతి ఇవ్వాల్సిఉంది. ఆ మేరకు పొరుగు జిల్లాల్లో ఇప్పటికే కౌన్సెలింగ్ పూర్తయింది. జిల్లాలో కూడా దాదాపు నెలరోజుల క్రితమే అనుమతి వచ్చింది. రోస్టర్ పాయింట్లు సరిచూడడం, తదితర కారణాలతో ఇప్పటివరకు పదోన్నతి ఇవ్వకుండా డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఇద్దరు ప్రధాన అధికారులు తాత్సారం చేశారని సమాచారం. మరోవైపు సాదారణ బదిలీలకు మార్గదర్శకాలు విడుదలయ్యాయి. హఠాత్తుగా పదోన్నతి అంశాన్ని తెరపైకి తీసుకురావడంతో పలు ఆరోపణలు వచ్చాయి. సాధారణ బదిలీలు పూర్తికాకుండా పదోన్నతులు ఇవ్వడం మార్గదర్శకాలకు విరుద్ధమని డీఎంహెచ్‌వో కార్యాలయవర్గాలు ఆ ఇద్దరు అధికారులకు నచ్చజెప్పేప్రయత్నంచేసినట్టు తెలుస్తోంది. పదోన్నతి కౌన్సెలింగ్‌పై రాష్ట్ర అధికారి ఒకరిని ఆ ఇద్దరు అదికారులు సంప్రదించగా, జిల్లాలో ఇబ్బందులు లేకుంటే పదోన్నతి ఇవ్వచ్చని సూచనలు ఇచ్చారు. జిల్లాలోని గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు పదోన్నతి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు మంగళవారం హఠాత్తుగా మెసేజ్‌లు పంపారు. వారిద్దరూ జిల్లా అధికారులు కావడంతో నిబంధనలకు విరుద్ధం అయినా కార్యాలయవర్గాలు పదోన్నతి కౌన్సెలింగ్‌కు బుధవారం ఏర్పాట్లు చేశాయి. మరోవైపు సీనియర్ రెగ్యులర్ ఏఎన్‌ఎంలకు బదిలీలపై ఆ ఇద్దరు అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని రెండురోజుల క్రితమే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనితో ఇద్దరు కార్యాలయ అధికారులను రెగ్యులర్ ఏఎన్‌ఎంలు కలుసుకున్నారు. తమకు బదిలీలు పూర్తయిన తర్వాతే గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు ఎంపీహెచ్‌ఏ (ఫిమేల్)గా పదోన్నతులు ఇవ్వాలని అభ్యర్థించినా అరణ్యరోదనే అయింది. గ్రేడ్-3 ఏఎన్‌ఎంలు పదోన్నతి కౌన్సెలింగ్ నిమిత్తం చేరుకున్నారు. తమకు బదిలీలు పూర్తయిన తర్వాతే వారికి పదోన్నతులు ఇవ్వాలని రెగ్యులర్ ఏఎన్‌ఎంలు కూడా డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఎవరి డిమాండ్లపై వారు ఆందోళనకు దిగడంతో రాత్రి 10 గంటలు దాటినా ఉద్రిక్తత కొనసాగింది. ఈ విషయంకాస్తా జిల్లా కలెక్టర్ దృష్టికివెళ్లడంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు ఏలూరు ఆర్డీవో వైద్యాధికారి కార్యాలయానికి చేరుకున్నారు. తమకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించే వరకు కార్యాలయ ప్రాంగణాన్ని వీడేదిలేదని గ్రేడ్-3 ఏఎన్‌ఎంలు తేల్చిచెప్పడంతో వివాదం తారస్థాయికి చేరింది.


జిల్లా వైద్యాధికారి కార్యాయలంలో ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లతో చర్చలు జరుపుతున్న ఆర్డీవో, డీఎంహెచ్‌వో

ఏలూరు ఆర్డీవో, డీఎంహెచ్‌వో, ఏవోల సమక్షంలో బుధవారం రాత్రి చర్చలు జరిగిన నేపథ్యంలో గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు పదోన్నతులు ఈ నెల 8న నిర్వహించేలా అధికారులు ప్రతిపాదన చేశారు. దీనిపై రాత్రి వరకు ప్రతిష్టంభన కొనసాగుతోంది. మరోవైపు మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుగా సాధారణ బదిలీలు నిర్వహించిన తర్వాతే పదోన్నతులు చేపట్టాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించాలని అభ్యర్థిస్తూ రెగ్యులర్ ఏఎన్‌ఎంలు గురువారం న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి యోచిస్తున్నట్టు సమాచారం.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్

వెన్నుపోటు.. గొడ్డలి వేటు పేటెంట్ జగన్‌దే : అంగర

పాలకొల్లు టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి):వెన్నుపోటు, గొడ్డలి వేటు పేటెంట్ జగన్‌కే ఉందని మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ అన్నారు. పాలకొల్లు టీడీపీ కార్యాలయంలో బుధవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినంగా ఊరేగింపులు జరపడం జగన్‌కు, ఆ పార్టీ నాయకులకు సిగ్గు లేకపోవడానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ప్రజలకు వెన్నుపోట్లు, బాబాయ్‌కు గొడ్డలి పోటు వేసింది జగన్ కాదా అని ప్రశ్నించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలన నుంచి విముక్తి పొంది ఏడాది గడిచినందున కూటమి శ్రేణులు ఆనందంగా ఉన్నాయన్నారు. టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, జనసేన నాయకులు తులా రామలింగం, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె.కొండప్రసాద్, టీడీపీ నాయకులు వల్లభు శ్రీనివాస్, నాయకులు ధనాని ప్రకాష్, తమ్మినీడి సత్య నారాయణ రావు, మీసాల రాము తదితరులు పాల్గొన్నారు.

అధికార మదానికి సమాధి కట్టిన రోజు : జోగయ్య

పాలకొల్లు అర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా రాష్ట్ర ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని మాజీ ఎంపీ, కాపు, బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు చేగొండి వెంకట హరిరామజోగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ నాయకుడు జగన్ వెన్నుపోటు దినం అంటూ హడావిడి చేయడం విడ్డూరంగా ఉందని, రాష్ట్ర ప్రజలు ఊపిరి పీల్చుకున్నరోజు 2024 జూన్ 4 అని జోగయ్య పేర్కొన్నారు. వైసీపీ అధికార మదానికి సమాధి కట్టిన రోజు అని అభివర్ణించారు.

డీసీసీబీని లాభాల బాట పట్టిస్తా : గన్ని



డీసీసీబీ చైర్మన్‌గా గన్ని ప్రమాణ స్వీకారం

ఏలూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తనకు ప్రతి ష్టాత్మకమైన డీసీసీబీ, ఆప్కాబ్ చైర్మన్‌ల పదవులు కట్టబెట్టిన సీఎం చంద్రబాబు, ప్రధాని మోడీ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర రైతులందరికి సత్వర సేవలందించి, మెప్పు పొందేలా పనిచేస్తానని డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. ఏలూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ప్రధాన కార్యాలయంలో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీసీబీబీ సీఈవో పి సింహాచలం ఆయనతో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ డీసీసీబీని లాభాల బాట పట్టిస్తానన్నారు. డీసీసీబీ కార్యాలయం వద్ద ఉంగుటూరు నేతలు బాణా సంచా పేల్చి పండుగ చేసుకున్నారు. ఆప్కాబ్ ఎండీ త్రినాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కాపు కార్పొరేషన్ చైర్మన్ సుబ్బారాయుడు, ఏపీఐఐసీ చైర్మన్ రామరాజు, ఇడా చైర్మన్ శివప్రసాద్, జడ్పీ చైర్మన్ పద్మశ్రీ, మాజీ డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్‌లు కరాటం రాంబాబు, రవివర్మ, బీజేపీ, జనసేన నేతలు గన్నిని అభినందించారు.



డీసీఎంఎస్ చైర్మన్ మురళీకృష్ణకు గజమాలతో సిబ్బంది సత్కారం

రొయ్యల రైతులకు రుణాలు : చాగంటి

ఏలూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రొయ్య రైతులకు కూడా డీసీసీబీ సహకారంతో క్రెడిట్ పద్ధతిన రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ(చిన్న) అన్నారు. ఏలూరు డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డీసీవో ఆరిమిల్లి శ్రీనివాస్ చాగంటితో పదవీ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు, కూటమి శ్రేణులు ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సకాలంలో అందుబాటులో ఉంచడంతో పాటు, తాను వారికి నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. డీసీఎంఎస్ ఉద్యోగుల భారీ గజమాలతో చైర్మన్‌ను సత్కరించారు. బిజినెస్ మేనేజర్, అసిస్టెంట్ బిజినెస్ మేనేజర్ సుధాకర్‌లు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి

భీమవరం అర్బన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న టిడ్కో ఇళ్లు, జగనన్న ఇళ్లు, ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న వారికి పట్టాలు, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎం.సీతారాం మోటార్ సైకిల్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ కట్టిన ఇళ్లను పేదలకు ఇవ్వడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పార్టీ టౌన్ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడుతూ ఈ నెల 10న ఆర్డీవో ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని, టిడ్కో ఇళ్లు రానివారు, జగనన్న ఇళ్ల స్థలాలు రానివారు, పోరంబోకు స్థలాల్లో నివాసం ఉంటున్న వారు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పలువురు సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

భర్త కనిపించడం లేదని రైలు దిగిపోయిన భార్య

భర్త వద్దకు చేర్చిన పోలీసులు



ఏలూరు క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భర్తతో కలసి రైలులో ప్రయాణిస్తుండగా మార్గ మధ్యంలో బోగీలో భర్త కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె ఒక రైల్వే స్టేషన్‌లో దిగేసింది. దిక్కుతోచని పరిస్థితిలో బిక్కుబిక్కు మంటూ ఉండడంతో రైల్వే పోలీసులు గుర్తించి ఆమె భర్త, అన్నయ్యకు సమాచారం ఇచ్చి బుధవారం సాయంత్రం ఆమెను వారికి అప్పగించారు. జార్ఖండ్ రాష్ట్రం బీదండి గ్రామానికి చెందిన అనిత ముర్ము, ఆమె భర్త రామ్‌లాల్‌తో కలిసి ఈ నెల 1న కేరళలో పనులు చేసుకోవడానికి బొకారో ఎక్స్‌ప్రెస్‌లో ధన్‌బాగ్ నుంచి యర్నాకులం వెళుతున్నారు. రైలు దెందులూరు సమీపానికి వచ్చేసరికి ఆమె భర్త రైలులో కనిపించలేదు. దీంతో ఆమె రైలు దిగేసింది. అక్కడున్న రైల్వే పోలీసులు ఆమె పరిస్థితి గమనించి ఏలూరు వన్‌స్టాప్ సెంటర్‌లో సంరక్షణలో ఉంచారు. ఆమె నుంచి వివరాలు తెలుసుకుని ఆమె భర్త అన్నయ్య బుధవారం సాయంత్రానికి ఏలూరు రాగా వారికి అనిత ముర్మును అప్పగించారు.

బదిలీ హడావుడి నడుమ..

గురువులకు శిక్షణ



- వెబ్ ఆప్షన్లతో టీచర్ల కుస్తీ
- డీఆర్పీలకు రేపటి వరకు శిక్షణ
- 8 నుంచి స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలకు
- నెరవేరని లక్ష్యం

ఏలూరు అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బదిలీల హడావుడిలో ఉన్న ఉపాధ్యాయుల్లో కొందరు శిక్షణ కార్యక్రమాలతో సతమతం అవుతున్నారు. దీనితో శిక్షణ కార్యక్రమాలు ఆశించిన లక్ష్యం నెరవేరే దిశగా సాగడం లేదు. సెకండరీ విద్యలో ప్రారంభించనున్న టీచర్ హ్యాండ్‌బుక్, స్టూడెంట్ అసెస్‌మెంట్ బుక్, కరికులం, తదితర అంశాలపై డీఆర్పీలకు ప్రస్తుతం నిర్వహిస్తోన్న మూడు రోజుల శిక్షణ తరగతులు ఆశించిన లక్ష్యానికి దూరంగా ఉంటున్నాయి. సాధారణ బదిలీలు జరుగుతున్న వేళ నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు హాజరయ్యే స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయుల్లో బదిలీలు, వెబ్ ఆప్షన్లు నమోదు, తదితర అంశాలవైపే మొగ్గు కనబడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో శిక్షణ తరగతులు నిర్వహించాలని ఇంతకుముందే నిర్ణయించారు. మండలాల్లో స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణనిచ్చేందుకు ముందుగా ఆయా సబ్జెక్టుల్లో ఎంపికచేసిన డీఆర్పీలకు స్టేట్ రిసోర్స్ పర్సన్లతో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఏలూరు సుబ్బమ్మ దేవి మునిసిపల్ హైస్కూలులో మూడురోజులపాటు నిర్వహించే డీఆర్పీల శిక్షణ తరగతులు గురువారంతో ముగుస్తాయి. డీఆర్పీలంతా జిల్లావ్యాప్తంగావున్న 3250 మంది స్కూల్ అసిస్టెంట్లు, పదుల సంఖ్యలో ప్రధానోపాధ్యాయులకు నిర్ణీత అంశాలపై ఈ నెల 8, 9, 10 తేదీల్లో డివిజన్లలో శిక్షణనిచ్చేలా షెడ్యూలు ఖరారు చేశారు. కార్యక్రమం ఉద్దేశ్యం మంచిదేనైనా ప్రస్తుతం టీచర్ల బదిలీలు జరుగుతున్న నేపథ్యంలో శిక్షణపై ఆసక్తి కనబరచడం లేదని తెలుస్తోంది. దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లు ఆయా ఖాళీలకు వెబ్ ఆప్షన్లను ఇచ్చేందుకు బుధవారం సాయంత్రం తుది గడువు కావడం, అంతకుముందే సబ్జెక్టువారీగా సీనియార్టీ జాబితా విడుదలచేయడం, తదితర ప్రక్రియల నేపథ్యంలో డీఆర్పీల శిక్షణకు హాజరైన స్కూల్ అసిస్టెంట్లలో అత్యధికులు బదిలీలవైపే ఆసక్తి కనబరిచారు. ముఖ్యంగా తప్పనిసరి బదిలీ టీచర్లు, వయస్సులో పెద్దవారు వెబ్ ఆప్షన్లు ఇవ్వడానికి సమయం పడుతుండడంతో ఆ దిశగానే అభ్యర్థించి పర్మిషన్‌పై ముందుగానే వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు.

వీరిదో విచిత్ర సమస్య..!

కొద్దిరోజుల క్రితమే అర్హులైన స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెచ్‌ఎం పదోన్నతులు ఇచ్చారు. ఈ క్రమంలోనే కొత్తగా ఏర్పాటవుతోన్న మోడల్ ప్రైమరీ స్కూళ్లకు హెచ్‌ఎంలుగా ఆసక్తికనబరిచిన స్కూల్ అసిస్టెంట్లను కౌన్సెలింగ్‌పై నియమించారు. ఇలా స్థానచలనం పొందినవారిలో పలువురు తాజాగా నిర్వహిస్తోన్న డీఆర్పీల శిక్షణకు నియమితులయ్యారు. ఇపుడు వీరందిరిదీ వింత పరిస్థితి. గ్రేడ్-2 హెచ్‌ఎం కేడర్/పీఎస్ హెచ్‌ఎం ఖాళీలు ఖాయమైన స్కూల్ అసిస్టెంట్లు భవిష్యత్‌లో ఎస్సీఈఆర్టీ శిక్షణకు ఎలా ఉపకరిస్తారనే చర్చజరుగుతోంది. ఈ నేపథ్యంలో సాధారణ బదిలీలకు ముందు లేదా బదిలీ ప్రక్రియ ముగిసి పాఠశాలలు పునఃప్రారంభమైన తర్వాత నూతన సంస్కరణలపై శిక్షణ ఇస్తే అందరికీ ప్రయోజనకరంగా ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఒక్కో టీచరుపై శిక్షణ ఖర్చు రూ.700

డీఆర్పీల శిక్షణకు హాజరయ్యే స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలకు మూడు రోజులకు స్టేషనరీ, వర్కింగ్ లంచ్, స్నాక్స్, టీ, టీఏ, డీఏల నిమిత్తం ఒకొక్కరిపై రూ.700 ఖర్చు చేస్తున్నారు. డివిజన్లలో 3,250 మంది స్కూల్ అసిస్టెంట్లకు, హెచ్‌ఎంలకు ఇదేరీతిలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఆ ప్రకారం ఏలూరు జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలకు సుమారు రూ.25 లక్షలు వెచ్చిస్తున్నారు. రాష్ట్రంలో 26 జిల్లాలకు సుమారు రూ.6.50 కోట్లు ఖర్చుచేయాల్సి ఉంటుంది. వీటికితోడు శిక్షణకు హాజరైనవారందరికీ ఆర్జిత సెలవులు ఇవ్వాలి. ఇంత పెద్దమొత్తం ఖర్చు చేసినా తాజా బదిలీల్లో పలువురికి స్థానచలనం వల్ల శిక్షణ ఎంత వరకు ఉపయోగకరమని చెబుతున్నారు.

జీతాలివ్వండి..!

సత్యసాయి మంచినీటి పథకం సిబ్బంది ఆకలి కేకలు



పోలవరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి):జీతాల బకాయిలు ఇప్పించండి మహాప్రభో అంటూ కనిపించిన ప్రతి అధికారిని, ప్రజాప్రతినిధుల వద్ద మొర పెట్టుకుంటున్నారు సత్యసాయి మంచినీటి పథకం కార్మికులు. 8 నెలలుగా వేతన బకాయిలు అందక పూట గడవడానికి అప్పులు చేసి ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. ఇంటి అద్దె, కిరాణా, పిల్లల చదువులు, నిత్యావసరాల కోసం చేసిన అప్పులు చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పని మాని వేరే పని చేయడానికి కూడా చేతిలో పైసా లేదని చెబుతున్నారు.

పోలవరం నుంచి చింతలపూడి వరకూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు సత్యసాయి సేవా సంస్థలు 2005లో పోలవరం మండలం పట్టిసీమ పంచాయతీలో కన్నాపురం అడ్డరోడ్డు వద్ద సుమారు రూ.15కోట్లతో సత్యసాయి మంచినీటి పథకం ఏర్పాటు చేశారు. 2006లో నిర్మాణం పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగించారు. 2007లో జిల్లా కలెక్టర్ బోర్డు చైర్మన్‌గా ఎల్‌అండ్‌టి కంపెనీకి ప్రభుత్వం నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. అప్పటి నుంచి 2020 మార్చి వరకూ సిబ్బంది జీత భత్యాల మొత్తం ప్రభుత్వం విడుదల చేయలేదని ఎల్‌అండ్‌టి కంపెనీ బకాయి పెట్టింది. 2020 జూన్ వరకూ రూ.17 కోట్లు రావలసి ఉందని సిబ్బందికి 7 నెలల జీతాలు పెండింగ్ ఉంచి నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంది. దీంతో సత్యసాయి మంచినీటి పంపిణీ అగమ్యగోచరంగా మారింది. ప్రజల మంచినీటి అవసరాల కోసం పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు జోక్యంతో రెండు నెలలపాటు కార్మికులు విధులు నిర్వహించి మంచినీటి సరఫరా చేశారు. పాత జీతాల బకాయిలతో పాటు కొత్త జీతాల బకాయిలు కూడా రాకపోవడంతో సత్యసాయి మంచినీటి కార్మికులు 2020 ఆగస్టు నుంచి 2022 అక్టోబరు వరకూ 110 మంది కార్మికులు సమ్మె బాట పట్టడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పోలవరం, చింతలపూడి, గోపాలపురం, కొవ్వూరు 4 నియోజకవర్గాల్లో 17 మండలాలకు, 220 గ్రామాలకు మంచినీటి సరఫరా లేక ప్రజానీకం విలవిలలాడారు. గత ప్రభుత్వ పాలనలో కార్మికులకు కూటమి నేతల సంఘీభావంతో కొంతమేర జీతాలు అందడంతో మంచినీటి సరఫరా పునరుద్ధరించారు. పది రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే చొరవతో రెండు నెలల జీతాల బకాయిలు చెల్లించారు. 8నెలలు జీతాల బకాయిలు ఇవ్వకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నామని ఇదే తరహా కొనసాగితే మళ్లీ సమ్మెబాటపడతామని కార్మికులు చెబుతున్నారు. స్కీం నుంచి కొంతమందిని తొలగించారని మిగిలిన కార్మికులపై అదనపు భారం పడుతుందని, కొత్తగా విధుల్లో చేరిన వారికి 17 ఏళ్ల సీనియారిటీ ఉన్నవారికి ఒకే విధంగా జీతాలిస్తున్నారని, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యాలు కూడా లేవని సత్యసాయి కార్మికుడు మామిడిపల్లి ప్రసాద్ కార్మికుల ఆవేదన వ్యక్తం చేశారు.

మూడేళ్లుగా రూ.8 కోట్ల బకాయి

జీతాల బకాయిలపై విషయంపై ప్రస్తుత కాంట్రాక్టరు సత్యనారాయణను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి తమకు మూడేళ్లుగా రూ.8 కోట్లు అందలేదన్నారు. స్కీం నిర్వహణ, కార్మికుల జీతాల బకాయిల కోసం వడ్డీలకు బయట నుంచి అప్పులు తెచ్చి కొంత వరకు చెల్లిస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లుల చెల్లింపులు చేస్తే కార్మికుల జీతాల బకాయిలు, స్కీం నిర్వహణ జరుగుతుందని లేని పక్షంలో నిర్వహణ వదులుకోవలసిన పరిస్థితులు నెలకొంటాయని తెలిపారు.

తపాలా శాఖలో

బీమా ఏజెంట్ల నియామకం

భీమవరం అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భీమవరం పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా శాఖ జీవిత బీమా, గ్రామీణ తపాలా బీమా పథకాల కొరకు ఏజెంట్స్ నియామకం చేపట్టింది. అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తపాలా శాఖ భీమవరం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ కె.హరికృష్ణ ప్రసాద్ బుధవారం తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ అర్హత గల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు భీమవరం హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో ఈ నెల 19న ఉదయం 11 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్ 08816- 535440 సంప్రదించాలన్నారు.

పౌల్ట్రీ రైతుల నిరసన

తణుకు, జూన్ 4(ఆంధ్రజ్యోతి):కోడి గుడ్డుకు గిట్టుబాటు ధర రాకుండా ట్రేడర్లు సిండికేట్ అడ్డుపడుతోందని పౌల్ట్రీ రైతులు రెండో రోజు బుధవారం కూడా ఎగుమతులు నిలిపివేశారు. కలకత్తా, బీహార్ ట్రేడర్లు స్థానికంగా ఉంటూ సిండికేట్‌గా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపించారు. వారం రోజులు నుంచి కనీసం గిట్టుబాటు ధర రాకుండా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కనీసం నెక్ ధరకు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ట్రేడర్లు దిగొచ్చే వరకు నిరసన కొనసాగుతుందని రైతులు చెబుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తణుకు రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : తణుకు రైల్వే స్టేషన్ ఏరియాలో సంచరించే గుర్తు తెలియని వ్యక్తి తణుకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. తణుకు రైల్వే స్టేషన్ రోడ్డులో సంచరించే వ్యక్తి అనారోగ్యం పాలవడంతో స్థానికులు తణుకు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. సంబంధిత వ్యక్తి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని రూరల్ ఎస్ఐ కె.చంద్ర శేఖర్ తెలిపారు.

మంత్రి లోకేశ్ న్యాయం చేయాలి

11 ఏళ్లుగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదు

ఏలూరు కలెక్టరేట్ ఎదుట ఓ మహిళ ఆవేదన

ఏలూరు రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ఒక మహిళ తనకు న్యాయం చేయాలంటూ నిరసనకు దిగింది. తన సమస్య పరిష్కారం కాలేదంటూ ఇక మంత్రి లోకేశ్ బాబు తనను కాపాడాలంటూ ప్లకార్డుతో మహిళ ఆందోళన చేపట్టింది. పవరుపేట బడేటి వారి వీధిలో ఉంటున్న అలపర్తి రమాదేవికి తంగెళ్ళమూడిలో జేఎంజే పాఠశాల సమీపంలో 380 గజాల ఖాళీ స్థలం ఉంది. సికింద్రాబాదు దక్షిణ మధ్య రైల్వేలో ఉద్యోగం చేసి చింతా రాజశేఖర్ ఏలూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడని, ఈ క్రమంలో 2012వ సంవత్సరంలో రాజశేఖర్ తన స్థలాన్ని డెవలప్మెంట్‌కు తీసుకుని అపార్ట్‌మెంట్‌లో ఐదు ప్లాట్లు తనకు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడని తెలిపింది. ప్లాట్లను అమ్ముకుని తనకు ఒక్క పైసా కూడా ఇవ్వకుండా హైద్రాబాద్‌కు వెళ్లిపోయాడని ఆరోపించింది. గతంలో అపార్ట్‌మెంట్లో పంచాయతీ అప్రూవల్ లేకుండా నాల్గవ ఫ్లోర్ తప్పుడు సంతకాలతో నిర్మించారని, దీనికి అప్పటి పంచాయతీ అధికారులు, సిబ్బంది సహకరించారని ఆరోపించారు. కొందరు వైసీపీ నాయకులు రాజశేఖర్‌కు మద్దతుగా నిలిచారని ఆరోపించారు. కొన్ని ప్లాట్లు కనస్ట్రక్షన్ మధ్యలో నిలిపివేయడంతో సుమారు కోటి రూపాయలు ఖర్చు చేసి పూర్తి చేసినట్లు తెలిపారు. తనకు న్యాయం చేయాలని ఇన్నేళ్లుగా తిరుగుతున్నా కాగితాలివ్వడం లేదని, రాజశేఖర్‌పై పోలీసులకు పిర్యాదు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. తాను విసిగి పోయానని మంత్రి లోకేశ్ అయినా తనకు న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి చేశారు.



నిరసన తెలుపుతున్న మహిళ

తుపాకీలతో కాల్చిన కుక్కలకు పోస్టుమార్టం

ఏలూరు క్రైం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కోళ్ళ ఫారంలోని కోళ్ళపై కుక్కలు దాడి చేస్తున్నాయనే కారణంతో ఇద్దరు వ్యక్తుల చేత నాటు తుపాకీతో 9 కుక్కలను హతమార్చిన ఘటనపై ఏలూరు త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈకుక్కల కళేబరాలను తమ్మిలేరు కాల్వలో గుర్తించారు. వాటికి పశువైద్యుల చేత బుధవారం తమ్మిలేరులోనే పోస్టుమార్టం త్రీటౌన్ పోలీసులు నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. నాటు తుపాకీ ఉపయోగించి కుక్కలను కాల్చిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు ఇప్పటికే గుర్తించినట్టు తెలుస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో వారిని అరెస్టు చేయనున్నారు. వారిని తీసుకొచ్చిన కోళ్ల ఫారం యజమాని ఎవరనేదానిపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పాము కాటుకు మహిళ మృతి

పెదవేగి, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : పాముకాటుకు ఓ మహిళ మృతి చెందింది. కూచింపూడికి చెందిన ఈర్ల రాటమ్మ గతనెల 19న కూచింపూడి సమీపంలోని న్యాయంపల్లిలో ఓ రైతుకు చెందిన వంగతోటలో కూలిపనికి వెళ్లగా పాము కాటు వేసింది. వెంటనే ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్సకు విజయవాడలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తిరిగి ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకొచ్చారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రాటమ్మ(36) బుధవారం ఉదయం మృతి చెందింది. దీనిపై కేసునమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపారు.

పురుగు మందు తాగిన యువకుడి మృతి

లింగపాలెం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒక యువకుడు పురుగుమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కొణిజర్ల గ్రామానికి చెందిన వేల్పుల సతీశ్(27) గత నెల 29న పురుగుమందు తాగి చెరువు గట్టున అపస్మారక స్థితిలోకి వెళ్లగా స్థానికులు గుర్తించి హుటాహుటిన ఏలూరు తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు.

అనారోగ్యంతో పురుగు మందు తాగి మరొకరు..

లింగపాలెం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలు తాళలేక ఓ వ్యక్తి ఈ నెల 3న పురుగుమందు తాగడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. టీసీహెచ్‌ఆర్ పాలెం గ్రామానికి చెందిన ఈది శేఖర్(39) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఎంతకాలం గడచినా అనారోగ్యం తగ్గకుండా ఎక్కువ కావడంతో ఈ నెల 3న ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో పురుగుమందు తాగాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లగా అతని భార్య గమనించి వెంటనే చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మరణించినట్లు ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. శేఖర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



కంటైనర్ లారీ కింద ఉన్న మృతదేహం, (ఇన్‌సెట్‌లో) మృతిచెందిన చంద్రరావు

పార్శిల్ లారీ ఢీకొని టైలర్ మృతి

ఏలూరు క్రైం, జూన్ 4(ఆంధ్రజ్యోతి):జాతీయ రహదారిపై డివైడర్ దాటుతుండగా ఒక లారీ అతి వేగంగా వచ్చి ఢీ కొనడంతో ఓ టైలర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరులోని మోతేవారితోటనకు చెందిన రేపి చంద్రరావు (44) టైలరింగ్ పని చేస్తూ ఉంటాడు. మూడు రోజుల క్రితం టైలరింగ్ పనిచేయడానికి గుంటూరు వెళ్లాడు. తిరిగి మంగళవారం రాత్రి ఒక ప్రైవేటు వాహనంలో వచ్చి ఏలూరు మెయిన్ బైపాస్ రత్నాస్ హోటల్ వద్ద బుధవారం తెల్లవారు జామున దిగాడు. అక్కడ రోడ్డు దాటుతుండగా రాజమండ్రి నుంచి విజయవాడ వైపు వెళ్లే సింధూ పార్శిల్ సర్వీసెస్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చంద్రరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ సి.హెచ్.కె. దుర్గా ప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



చోరీ సొత్తును, నిందితుడిని చూపిస్తున్న పోలీస్ అధికారులు

దొంగ అరెస్ట్.. రూ.31.83 లక్షల సొత్తు స్వాధీనం

ఏలూరు క్రైం, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : పట్టపగలు ఓ ఇంటి తాళాలు పగులగొట్టి 33 లక్షల విలువైన బంగారు, వెండి, నగదును అపహరించిన దొంగను అరెస్టు చేశామని ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఎస్పీ కిశోర్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్పీతో పాటు ఏఎస్పీ ఎన్ సూర్య చంద్రరావు, పోలవరం డీఎస్పీ ఎం వెంకటేశ్వర రావు, పోలవరం సీఐ పి.బాలసురేష్ బాబు, పోలవరం ఎస్ఐ ఎస్ఎస్ఎస్ పవన్ కుమార్‌లు పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ ఏడాది మే 13న పోలవరం మండలం జగన్నాథపేట గ్రామానికి చెందిన శ్రీపద్మనాభుని శ్రీనివాసగుప్త వైద్యం కోసం తన ఇంటికి తాళాలు వేసి కుటుంబంతో సహా రాజమహేంద్రవరానికి వెళ్ళారు. ఆయన తిరిగి వచ్చేటప్పటికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని 33 లక్షల రూపాయల విలువైన బంగారం, వెండి, నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేశారు. వారికి లభించిన సీసీ కెమెరాలు ఆధారంగా నేరస్థుడిని గుర్తించారు. పోలవరానికి చెందిన హిస్టరీ షీటు ఉన్న ఉసురుమర్తి గంగాజలంను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. అపహరణ చేసిన సొత్తు అంతా తన ఇంట్లోనే ట్రంకుపెట్టెలో దాచినట్లు చెప్పడంతో ఆ పెట్టెను స్వాధీనం చేసుకున్నారు. అందులో 247.16 గ్రాములు బంగారం(22 లక్షల 12 వేల 82 రూపాయలు), 2.4 కేజీల వెండి (రెండు లక్షల 71 వేల 506 రూపాయలు), ఏడు లక్షల రూపాయల నగదు మొత్తం 31 లక్షల 83 వేల 588 రూపాయలు సొత్తును స్వాధీనం చేసుకున్నట్లుగా చెప్పారు. నేరస్థుడు గతంలో పోలీస్‌శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తు వీరవాసరం పోలీస్ స్టేషన్‌లో ఉంచిన నగదును అపహరించిన కేసులో డిస్మిస్ అయ్యాడని అప్పటి నుంచి నేరాలు చేస్తున్నాడని అతనిపై హిస్టరీ షీటు కూడా ఉందన్నారు. ఈ కేసును చాకచక్యంగా దర్యాప్తు చేసిన పోలవరం సీఐ బాల సురేష్ బాబు, ఎస్ఐ పవన్ కుమార్, హెడ్‌కానిస్టేబుళ్ళు శ్రీనివాస్, సత్యనారాయణ, కానిస్టేబుళ్ళు బాబీ, కోటేశ్వరరావు, మురళీ కృష్ణలను ఎస్పీ అభినందించి నగదు రివార్డులను అందించారు.



గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

ఆకివీడులో పోలీస్ పికెటింగ్

ఆకివీడు, జూన్ 4(ఆంధ్రజ్యోతి):ఆకివీడు సంతమార్కెట్ పడాల వీధిలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. బాలికపై అత్యాచారం చేసిన వృద్ధుడు మీరావలిని అదుపులోకి తీసుకుని లాకప్‌లో పెట్టిన తరువాత బాలిక మేనమామ బ్లేడుతో నిందితుడిపై దాడిచేసి పలుచోట్ల గాయపర్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ హనుమంతు నాగరాజు పర్యవేక్షణలో చేపట్టిన గస్తీని బుధవారం కూడా చేపట్టారు.

ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్త

గుండెపోటుతో మృతి



తాడేపల్లిగూడెం రూరల్, జూన్4 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్న గూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా పనిచేస్తున్న డాక్టర్ కేటి వెంకట రమణ(61) మంగళవారం రాత్రి గుండె పోటుతో మృతి చెందారు. 27 ఏళ్ల పాటు ఉద్యోగ జీవితంలో ఆయన సేవలు అందించి అంచెలంచెలుగా ఎదిగారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతికి విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ ఆధ్వర్యంలో వెంకటరమణ చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి ఆయన మృతికి సంతాపం తెలిపారు. సంతాప కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.

సౌభాగ్యలక్ష్మీ ఆలయంలో శ్రీనివాసుని కల్యాణం

ఏలూరు కార్పొరేషన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మీదేవి అమ్మవారి ఆలయంలో బుధవారం అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత అమ్మవార్లకు, శ్రీవారికి మంగళ స్నానాలు నిర్వహించి తదుపరి విశేష అలంకరణ జరిపి ప్రత్యేక హారతులు ఇచ్చి నివేదనలు సమర్పించారు.ఆలయ చైర్మన్ కె.జి.ఎస్.వి.గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు చినబాబు, శ్రీనివాసరావు, సాయి పల్లవి రామరాజు, సకలాబత్తుల పోతురాజు, ప్రవీణ్‌లు భక్తులకు ఏర్పాట్లు చేశారు.

నేడు మొక్కలు నాటనున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

జంగారెడ్డిగూడెం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురు వారం జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించ నున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి పాల్గొని మొక్కలు నాటనున్నట్టు రమణ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నాటేందుకు 2300 మొక్కలు కార్యాలయానికి చేరుకున్నట్లు ఆయన తెలిపారు.

కొడుకు నుంచి రక్షణ లేక ఓ తల్లి ఇక్కట్లు

ఏలూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఉంటున్న ఇంటిని లాగేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, కాపాడాలని ఓ తల్లి గత నెల 14న పీజీఆర్ఎస్(ప్రజా ఫిర్యాదుల వేదిక)ను ఆశ్రయించినా ఫలితం లేదు. ఇప్పటికీ న్యాయం జరగకపోగా, అటు ఆర్డీవో ఆఫీసు, ఇటు పోలీస్ స్టేషన్‌కు బాధితురాలిని తిప్పించుకుంటున్నారు. దెందులూరు మండలం అప్పారావుపాలెంలో రిటైర్డు వీడీవో భార్య వాసే కనకమ్మ భర్త రెండేళ్ల క్రితం చనిపోయాడు. ఈమెకు ఉన్న ముగ్గురు కొడుకులు, వీరంతా అదే ఊరిలో సమానంగా ప్లాట్లను ఇచ్చింది. కాగా ఆమెకు నీడ కోసం, చివరి దశలో ఆదుకుంటుందని ఉంచుకున్న మూడుసెంట్ల స్థలాన్ని పెద్దకొడుకు తన పేరిట రాయించుకునేందుకు తరచూ వచ్చి దాడి చేస్తున్నాడంటూ చిన్న కుమారుడితో కలిసి వచ్చి పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసింది. పెద్దకుమారుడితో పడలేక కాకినాడలో ఉంటున్న రెండో కుమారుడువద్దకు వెళ్లి తలదాచుకుంటోంది. ఈ విషయంలో తనకు న్యాయం చేయలేదని ఆయన వాపోయాడు.

కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయండి

ఏలూరు రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): విజయవాడలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం గ్రేడ్-2 రాష్ట్ర అధ్యక్షుడు జోషి పిలుపునిచ్చారు. గురువారం విజయవాడలోని బందర్ రోడ్ పీవీ మాల్ ఎదురుగా ఉన్న ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్లో జరగనుందని తెలిపారు. సమావేశానికి హాజరయ్యే గ్రామ రెవెన్యూ అధికారులకు ప్రభుత్వం స్పెషల్ క్యాజువల్ లీవ్ మంజూరు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న గ్రేడ్ 2 గ్రామ రెవెన్యూ అధికారులు తప్పనిసరిగా కౌన్సిల్ సమావేశానికి రావలిసిందిగా విజ్ఞప్తి చేశారు.

లక్ష్మీగణపతిస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

ఏలూరు కార్పొరేషన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సత్రంపాడులోని దేవదాయ శాఖ ఆధ్వర్యంలోని లక్ష్మీగణపతిస్వామి ఆలయంలో హుండీలను బుధవారం కలపర్రు గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి ప్రకృతాంబ పర్యవేక్షణలో లెక్కించారు. 69 రోజులకు లెక్కించగా రూ.89 వేల 589 ఆదాయం లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్.చిననాగేశ్వరరావు తెలిపారు. బుధవారం కావడంతో స్వామిని భక్తులు గరికతో అర్చన జరిపి బెల్లం నివేదనలు సమర్పించారు. భక్తి గీతాలు ఆలపించి భజనలు నిర్వహించారు.ఆలయార్చకులు రెండు చింతల రాఘవేంద్రశర్మ భక్తులతో పూజలు చేయించారు.

కామవరపుకోట టీడీపీ మండలాధ్యక్షుడిగా హరిరామకృష్ణ



కామవరపుకోట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండలాధ్యక్షుడిగా అంకాలం పాడు గ్రామానికి చెందిన ఏలూరి హరిరామకృష్ణ (హరిబాబు)ను నియమిస్తూ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మంగళవారం ప్రకటించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, నెక్కలపు గంగాధరరావు ఉన్నారు.హరిరామకృష్ణను బుధవారం రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని కోనేరు గార్డెన్ నర్సరీలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన టీడీపీ శ్రేణులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొండగూడెంలోని గ్రామ సచివాలయ ప్రాంతంలో టీడీపీ నాయకులు హరిరామకృష్ణతో కేక్‌ను కట్ చేయించారు. కార్యక్రమాల్లో ఏఎంసీ మాజీ చైర్మన్ కోనేరు వెంకటసుబ్బారావు, మాజీ జడ్పీటీసీ ఘంటా సుధీర్ బాబు, మాజీ వైస్ సర్పంచ్ నెక్కలపు సూర్యనారాయణ, టీడీపీ నేతలు నూతి రాటాలు, కోనేరు వెంకట్రామయ్య, బొబ్బిలి డాన్ దివాకర్, పండు జగదీష్, ఎం.కాంతారావు, గోధుమ మధు పాల్గొన్నారు.

మానవత మండల కార్యవర్గం ప్రమాణ స్వీకారం



ఉంగుటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండల మానవత నూతన కార్యవర్గ ప్రమాణం మంగళవారం రాత్రి నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర విస్తరణ కమిటీ చైర్మన్ సాగిరాజు జానకిరామరాజు మాట్లాడుతూ మానవత సేవలు విస్తృత పరచాలన్నారు. నూతన అధ్యక్షుడిగా కైకరం గ్రామానికి చెందిన కోనే వీరవెంకట సత్యనారాయణ, కార్యదర్శిగా రాజాని సతీశ్, కోశాధికారిగా గంజి రవి కుమార్, ఉపాధ్యక్షుడిగా దొంతల విజయకుమార్, సహాయ కార్యదర్శిగా తమ్మిన శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా రామిరెడ్డి వెంకటరెడ్డి, గుండుమోలు తాతారావు, బొప్పిడి ప్రతాప్, తాడిగడప వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు.

చోరీ సొత్తు రికవరీపై ఎస్పీ అభినందన



పోలవరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పోలవరం పంచాయతీ జగన్నాథపేటలో మే 13న జరిగిన చోరీ కేసులో నిందితులను చాకచక్యంగా పట్టుకుని చోరీసొత్తు రికవరీ చేసిన పోలవరం పోలీసులను బుధవారం ఎస్పీ అభినందించారు. 22.12 లక్షల బంగారం, 2.71 లక్షల వెండి వస్తువులు, రూ.7 లక్షల నగదు మొత్తం 31,83,588 లక్షల సొత్తు రికవరీ చేశారు. నిందితుడు ఉసురుమర్తి గంగాజలాన్ని పట్టుకోవడం పట్ల మరోవైపు గ్రామస్థులు, పలువురు ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేసి సిఐ బాలసురేశ్‌బాబు, ఎస్‌ఐ పవన్ కుమార్‌లను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత



జీలుగుమిల్లి, జూన్4(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత అని జీలుగుమిల్లి హెచ్‌పీ బంక్ డీలర్ మొడియం శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీహెచ్‌సీ, ఎంపీడీవో కార్యాలయం, జడ్పీ హైస్కూల్ పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులతో కలిసి శ్రీనివాసరావు మొక్కలు నాటారు. భావితరాలకు జీవవైవిద్యం, సక్రమమైన రుతువులు, స్వచ్ఛమైన గాలి, నీరు వంటివి మొక్కలు నాటడం వల్లే లభిస్తాయన్నారు. ఎంపీపీ కొర్స పోశమ్మ, ఎంపీడీవో టి.నిఖిల్‌మధుశరణ్, ఏవో మంగతాయారు, వైద్యాధికారి గాయిత్రి సిబ్బంది, నాగేంద్రబాబు, వెంకటరమణ, చరణ్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలపై నిరంతర నిఘా

(ఐదో పేజీ తరువాయి)

తీరిన వారున్నట్టు ఇటీవల లెక్క తేల్చారు. ఉమ్మడి రాష్ట్రాల పరిధిలో ఎల్ఐసీ సంస్థతో అప్పట్లో ఒప్పందాలు జరిగాయి. ఉన్నతస్థాయిలో దీనిపై చర్చలు సాగుతున్నాయి. దీనికి కొంత సమయం పడుతుంది.

- తోటగొంది‌లో అంగన్‌వాడీ టీచర్ పోస్టు భర్తీకి ఓపెన్ టెస్ట్ పూర్తి చేసిన అభ్యర్థినిని ఎంపిక చేశారు. డిగ్రీ చేసిన అభ్యర్థిని ఉండగా ఆమెకు పోస్టు ఇవ్వలేదు.
  - సలాది సూర్యచంద్రరావు,మాజీ సర్పంచ్

ఐసీడీఎస్ పీడీ: ఆ రోజు ఇంటర్వ్యూ నేను కూడా చేశాను. ఇంటర్వ్యూలో మార్కులు ఆధారంగా పోస్టు భర్తీ చేశాం.పిల్లలకు సరిగ్గా చెప్పగలరా, స్థానికంగా ఉంటారా? అన్నది చూసే ఎంపికచేశాం.

- కిశోర బాలికల ఆరోగ్యంపై ఐసీడీఎస్ నుంచి అమలు చేసే కార్యక్రమాలేమిటి.
  - నాగమణి,కామవరపుకోట

ఐసీడీఎస్ పీడీ: 11 నుంచి 18 ఏళ్లలోపు వారిని కిశోర బాలికల కింద పరిగణనలోకి తీసుకుని, వారికి జిల్లా వైద్యఆరోగ్యశాఖ ద్వారా వ్యక్తిగత శుభ్రత, రక్తహీనత నివారణకు మందులు పంపిణీతో అవగాహన కార్యక్రమాలు ఈనెల 10 వరకు నిర్వహిస్తాం. జిల్లాలో 21,281 మందికి ఎంపిక చేశాం.

- కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో బాల్యవివాహాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.
  - మేఘన, సోషల్ వర్కర్, కైకలూరు

ఐసీడీఎస్ పీడీ: ఈ ఏడాదిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 90కు పైగా బాల్య వివాహాలను జిల్లా బాలల సంరక్షణాధికారి పర్యవేక్షణలో చైల్డ్‌మ్యారేజ్ ప్రొహిబిషన్ ఆఫీ సర్లు అడ్డుకున్నారు.

- చింతలపూడి నామవరం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సరుకులకు నాణ్యమైనవి ఇవ్వడం లేదు. ఎంతెంత పరిమాణంలో ఇస్తున్నారో చెప్పడం లేదు.
  - అశోక్, నామవరం

ఐసీడీఎస్ పీడీ: ఒకసారి సీడీపీవో ద్వారా వివరాలను తెలుసుకుని, చర్యలు తీసుకుం టాను. సరుకుల పంపిణీ వివరాలను నోటీసు బోర్డులో పెట్టిస్తాం.

ప్రవాహానికి ఆటంకాలను తొలగించండి..

ఉంగుటూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఏలూరు కాల్వ వెంబడి బాదంపూడి, వెల్లమిల్లి, నాచుగుంట, ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు, కైకరం వంటి గ్రామాల గుండా ప్రవహించే గోదావరి నీటికి గుర్రపు డెక్క ప్రవాహం ఆటంకంగా తయారైంది. దీంతో కాల్వ వదిలే సమయానికైనా పంట బోదెల పూడిక తీతలతో పాటు కాల్వలో తూడును తొలగించి సార్వా సాగుకు ఆటంకం లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. ఇరిగేషన్ అధికారులు మాత్రం కాల్వ వదలిన తరువాత తూడును తొలగించడానికి ప్రయత్నించడం వల్ల డబ్బు శ్రమ వృథా అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత యంత్రాలతో ఏలూరు కాల్వలో వంతెనల వద్ద పేరుకు పోయిన తూడును తొలగించే బదులు ముందస్తు ప్రణాళికతో ఉపాధి కూలీలను ఉపయోగించి తూడును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఏలూరు కాల్వలో పేరుకుపోయిన తూడు

కూటమి ఏడాది సంబరం..



భువ్వనపల్లిలో ఎమ్మెల్యే ధర్మరాజుకు కేక్ తినిపిస్తున్న దృశ్యం

వేడుకల్లో పాల్గొన్న జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు

భీమడోలు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన మొదలై ఏడాది పూర్తయిన సందర్భంగా భీమడోలు మండలంలోని భీమడోలు, గుండుగొలను గ్రామాల్లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. ఈకార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధర్మరాజు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలకు ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ ఏడాది కాలంలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముఖ్య మంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో గ్రామ, రాష్ట్ర స్థాయి వరకూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.

● జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిపూర్తయిన సందర్భంగా బుధవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ ఆధ్వర్యంలో అశ్వారావుపేట రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాణా సంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ముందుగా టీడీపీ నాయకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు,పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన రోజన్నారు. ప్రజా విప్లవానికి నియంత పాలకులు కొట్టుకుపోయారన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు,రావూరి కృష్ణ,పెనుమర్తి రామ్ కుమార్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్,షేక్ ముస్తఫా, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు,నంబూరి రామచంద్ర రాజు, పి.సౌభాగ్యవతి,మద్దిపాటి నాగేశ్వరరావు, బూరుగుపల్లి సూరిబాబు, జనసేన నాయకులు వలవల తాతాజీ, జి.ఉమామహేశ్వరి, రాజీ, బీజేపీ నాయకురాలు పి. రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని గరిమళ్ల చలపతిరావు అన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో రాక్షసరాజ్యం కొనసాగిందని ఆ రాక్షస పాలన అంతమయ్యి నేటికి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజలంతా పండుగ చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మోరంపూడి మల్లికార్జునరావు, ఎం.వరప్రసాద్, పి.మహేశ్‌బాబు, జి. బుజ్జయ్య, రాధాకృష్ణ పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: ఐదేళ్ల జగన్ రాక్షసపాలనకు ఏపీ ప్రజలు చరమగీతం పాడి నేటితో ఏడాది పూర్తయిందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. ముందుగా ఆయన టిడిపి నేతలతో కలిసి చినవెంకన్నను, సుందరగిరిపై కొలువైన లక్ష్మీనారసింహుని బుధవారం సందర్శించారు. ఆలయాల వద్ద అర్చకులు, అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో టీడీపీ కమిటీలు విజయవంతంగా పూర్తయ్యాయని, అందుకే దైవ ఆశీస్సుల కోసం ఆలయాలను దర్శిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గోపాలపురం ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, నేతలు పోలిన శ్రీనివాసరావు, లంకా సత్యన్నారాయణ, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, ఘంటా శ్రీనివాసరావు, చింతమనేని హనుమంతరావు, మటపర్తి బద్రి, పసుమర్తి సోమశేఖర్, దేవరపల్లి హేమంత్ పాల్గొన్నారు.



ఆలయంలో జ్ఞాపిక అందుకుంటున్న ఎమ్మెల్యే మద్దిపాటి

● కుక్కునూరు : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా కుక్కునూరులో సంబరాలు నిర్వహించారు. ఏడాది పరిపాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయడంలోనూ కూటమి ప్రభుత్వం ముందుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగంధర్ పాల్గొన్నారు.

● నిడమర్రు : ప్రజలకిచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు రెండు కళ్ళుగా విజయవంతంగా పూర్తిచేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే చెందుతుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. బుధవారం భువ్వనపల్లిలో జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తల ఆధ్వర్యంలో విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంజనేయ స్వామి ఆలయంలో దీపాలంకరణ చేసి అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక జనసేన కార్యకర్తలు ఉత్సాహంగా మందుగుండు సామగ్రి పేల్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చింతలపాటి బాసిరాజు, నిమ్మల దొరబాబు, అల్లుమోలు అరుణ్ కుమార్, సంకునాగేశు, తన్నీడ్ విజయకుమార్, సంకు కొండలరావు నాయుడు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో సంబరాల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఆయిల్‌పాం రైతులను ఆదుకోండి

ఏలూరుకార్పొరేషన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఆయిల్‌పాం రైతులు నష్టపోతున్నారని, ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్‌లు కోరారు. బుధవారం అన్నేభవనం వద్ద ఆయిల్‌పాం రైతుల సమస్యలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పామాయిల్ దిగుబడి సుంకం 20 నుంచి 10 శాతానికి తగ్గించడం వలన ఆయిల్‌పాం రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆయిల్‌పాం సాగు దేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందన్నారు. ప్రస్తుతం ధర రూ.20,290 నుంచి రూ.18,850కి తగ్గిందని, ఈ ధర మరింత తగ్గే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు సరిబత్తుల సీతారామయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

పాకాకు బీసీ నాయకుల సత్కారం



పూలదండతో సత్కరిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణను పలువురు బీసీ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఇటీవల ఢిల్లీలో ఎంపీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఏలూరు జిల్లాకు వచ్చిన సందర్భంగా ఏపీ బీసీ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌పిఆర్ విఠల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు పామర్తి యేసురాజు, ఈ శ్రీనివాసరావు, అచ్యుత్, అయినాల శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, పలువురు బీసీ నాయకులు శాలువాతో సత్కరించారు.

గోదావరి కాల్వ పూడికతీత పనుల పరిశీలన



పనులు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గోదావరి కాల్వలో పూడికతీత పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేసి ప్రతి రైతుకు సాగునీరందిస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. బుధవారం దెందులూరు మండలంలోని గుండుగొలను, శింగవరం, ఉండ్రాజవరం, కొవ్వలి పరిధిలో గోదావరి కాల్వలో పూడిక తీత పనులను గోదావరి కాల్వ(డీసీ) చైర్మన్ వెలమాటి రాంబాబు, నీటి సంఘం అధ్యక్షులు రంగారావు, రాంబాబు, వెంకట రమణలతో కలిసి చింతమనేని ప్రభాకర్ పనులను పరిశీలించారు.టీడీపీ క్లస్టర్ ఇంచార్జీలు బోడేటి మో హన్‌బాబు, కొవ్వలి టీడీపీ గ్రామాధ్యక్షుడు బగాతి చిన్నారావు, కసుకుర్తి రామకృష్ణ, నున్న లక్ష్మణ్, గార పాటి కొండయ్యచౌదరి, ఇప్పిలి వెంకటేశ్వరరావు, యూ నిట్ ఇన్‌చార్జి బాయి రాంప్రసాద్, గోవాడ నాగరాజు, సాగు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఏలూరు రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంత వరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని నెరవేర్చలేదని ఎమ్మెల్సీ వంకా రవీంద్ర ఆరోపించారు. వైసీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైన ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో బుధవారం వెన్నుపోటు దినం పేరుతో కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రజలకు సంక్షేమం కోసం పనిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్ళపల్లి జయప్రకాష్, గుడిదేశి శ్రీనివాస్, నేరుసు చిరంజీవి, కిలాడి దుర్గారావు పాల్గొన్నారు.

టీడీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

దెందులూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసిరావాలని పార్టీ పోతునూరు గ్రామాధ్యక్షుడు నున్న లక్ష్మణ్, పార్టీ కార్యదర్శి తోట సురేష్, యూనిట్ ఇన్‌చార్జి బాయి రాంప్రసాద్‌లు అన్నారు. బుధవారం మండలంలోని పోతునూరు సహకార సంఘం బ్యాంకు కార్యాలయ సమీపంలో పోతునూరు టీడీపీ గ్రామ విస్తృత స్థాయి సమావేశాన్ని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బోడేటి మోహన్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు తలారి ధన్యకుమార్, డొక్కు వెంకటేశ్వరరావులు పలు తీర్మానాలను చదివి వినిపించారు. దెందులూరు శాసన సభ్యులు చింతమనేని ప్రభాకర్ సహకారంతో రూ.కోటి రూపాయలతో సిమెంట్‌రోడ్లు మంజూరు చేసి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. నీటి సంఘం అధ్యక్షుడు చలసాని రాంబాబు, గండి రాజా, లంకా అప్పారావు జక్కుల జాన్‌బాబులు రైతులకు ఇబ్బందులు లేకుండా గోదావరి కాల్వ మరమ్మత్తులకు నిధులిచ్చినందుకు చింతమనేనికి కృతజ్ఞతలు తెలుపుతూ మరో తీర్మానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎర్నేటి పండు, మద్దా రంగారావు, నాగు పాల్గొన్నారు

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా సీఐ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గుడిపాడు వద్ద చికెన్ వ్యర్థాలతో కూడిన వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసినట్టు పెదపాడు ఎస్సై కట్టా శారద సతీశ్ తెలిపారు. చికెన్ వ్యర్థాలతో కూడిన ఐషర్ వాహనాన్ని, అందులోని సుమారు 10 వేల కిలోల చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో వీరమ్మకుంట గ్రామానికి చెందిన మరడాని రవి మత్స్యశాఖ అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చికెన్ వ్యర్థాలను వేస్తున్న చెరువును బుధవారం పరిశీలించి, తగు చర్యల నిమిత్తం ఆ చెరువు యజమానికి నోటీసు అందజేయనున్నట్టు మత్స్యశాఖ అధికారి (ఎఫ్‌డీవో) సతీష్ తెలిపారు.



ఏలూరు కేంద్రంలో యోగా చేస్తున్న చిన్నారులు



ధర్మాజీగూడెంలో కథలు చదివి వినిపిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు

ఏలూరు టూటౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. ఏలూరు గ్రంథాలయంలో రిసోర్స్ పర్సన్ శ్రీవల్లి, యోగాలో శిక్షణనిచ్చారు. మానసిక ప్రశాంతతకు శారీరక ధృడత్వానికి యోగా చేయాలన్నారు. శ్రీవల్లి విద్యార్థులకు స్వర్ణాంధ్ర 2047 పై క్విజ్ పోటీలు నిర్వహించారు. డిప్యూటీ లైబ్రేరియన్ సందీప్ కుమార్, అస్లాంపాషా, కనకదుర్గ పాల్గొన్నారు.

● పెదపాడు : విద్యార్థి దశ నుంచే మంచి లక్షణాలను పెంపొందించుకుని, సమాజం పట్ల అంకితభావం కలిగిన వ్యక్తులుగా తయారు కావాలని పెదపాడు గ్రంథాలయాధికారి జాన్‌బాబు తెలిపారు. రిసోర్స్ పర్సన్ పూడి రవికుమార్ మంచి నడవడిక - మాట తీరు అనే అంశంపై విద్యార్థులకు వివరించారు.

●పెదవేగి: విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయం తొలిమెట్టు అవుతుందని రామశింగవరం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మేకా లక్ష్మీనారాయణ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా రామశింగవరం హైస్కూల్ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ కథలను చదివి వినిపించారు. గ్రంథపాలకుడు తోట అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

● లింగపాలెం : విద్యార్థులు చదువుతో పాటు ఆటలలో ముందుండాలని గ్రంథాలయాధికారి సి.హెచ్.వెంకటరమణ అన్నారు. ధర్మాజీగూడెం గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు ఇంగ్లీష్‌లో రాయడం, చదవడం నేర్పించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ సి.హెచ్.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

ఏలూరు క్రైం, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : అప్పు తీర్చడం లేదని ఒక యువకుడిని ఇంటి నుంచి కిడ్నాప్ చేసి దాడి చేసి గాయపర్చడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని ఎంఆర్‌పిఎస్ నాయకులు బుధవారం పరామర్శించారు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతం అరుంధతి కాలనీకి చెందిన జొన్నకూటి ఆంజనేయులు రూ20 వేలు అప్పుగా తీసుకున్నాడు. కొద్ది రోజుల నుంచి వడ్డీ చెల్లించకపోవడంతో ఈ నెల 2న రాత్రి నాని మరి కొంత మంది వచ్చి ఆంజనేయులను తీసుకెళ్ళి చిత్రహింసలకు గురి చేశారు. గాయాలపాలైన బాధితుడు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనిని ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, రాష్ట్ర నాయకులు కాశీ కృష్ణ, ఎంఎస్‌పి నాయకులు బయ్యారపు కుటుంబరావు, సయ్యద్ అలీ, వంగలపడి యోబు, వినయ్‌కుమార్, జొన్నకూటి గిరిజ, బల్లా హేమలతలు పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు.

రేషన్ పంపిణీ పట్ల హర్షం

పోలవరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ కొనసాగుతోంది. లబ్ధిదారులు బుధవారం తమ పరిధిలోని రేషన్ దుకాణాల్లో సరుకులు తీసుకుని వెళ్లారు. గతంలో వ్యాన్ వచ్చిన సందర్భంలో కూలి పనులకు వెళ్తే మళ్లీ ఆ వాహనం ఎక్కడ ఉందో వెతుక్కుని వెళ్లాల్సి వచ్చేదని, అంతే కాకుండా 10వ తేదీలోపు తీసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఎలాంటి ప్రయాస లేకుండా తీరికవేళలో ఎప్పుడైనా తెచ్చుకునే అవకాశం ప్రభుత్వం కల్పించడం పట్ల రేషన్ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులకు వికలాంగులకు నేరుగా ఇళ్లకు వెళ్లి రేషన్ ఇవ్వడం శుభపరిణామం అని రేషన్ లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఏలూరు రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): చాటపర్రు సెక్షన్, చాటపర్రు ఫీడర్ పరిధిలోని చాటపర్రు రోడ్డు, బాలాజీ నగర్, వినాయక నగర్, మొండికోట, 11 కేవీ కొమడవోలు సబ్‌స్టేషన్ పరిధిలోని ఎన్టీయార్ నగర్, కొమడవోలు లైన్‌ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆ శాఖ అధికారి కె.ఎం.అంబేద్కర్ తెలిపారు. వినియోగదారులు సహకరించవలిసిందిగా విజ్ఞప్తి చేశారు.

ధర్మాజీగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో

లింగపాలెం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ధర్మాజీగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న పలు గ్రామాలలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. ధర్మాజీగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తగా లైన్లు, ట్రీ కటింగ్, మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జానంపేట సబ్ స్టేషన్ పరిధిలో..

పెదవేగి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం జానంపేటలోని విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కేఎం.అంబేడ్కర్ తెలిపారు. ఈ కారణంగా జానంపేటతో పాటు ముత్తనవీడు, జగన్నాథపురం, బి.సింగవరం గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

పెదవేగి, రామశింగవరం...

మండల కేంద్రం పెదవేగితో పాటు రామశింగవరం విద్యుత్ ఉప కేంద్రాల్లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కేఎం.అంబేడ్కర్ తెలిపారు. ఈ కారణంగా పెదవేగి పరిధిలో పెదవేగి, లక్ష్మీపురం, సీతాపురం, సూర్యారావుపేట, గార్లమడుగు, రామశింగవరం పరిధిలో రామశింగవరం, బాదరాల, తాళ్లగోకవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్టు తెలిపారు.

ఉద్యోగాలు ఆదివాసీలకే ఇవ్వాలి

బుట్టాయగూడెం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ఏరియాలో నూరు శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలకే ఇవ్వాలని గిరిజన డీఎస్సీ సాధన జీపుజాత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సురేంద్ర డిమాండ్ చేశారు. ఏజెన్సీ డీఎస్సీ సాధన కోసం ప్రారంభించిన జీపుజాత బుధవారం కె.ఆర్.పురం ఐటీడీఏ వద్ద ముగిసింది. తెల్లం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సురేంద్ర మాట్లాడుతూ గిరిజనుల కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, ఏజెన్సీ ఉద్యోగ నియామకాల చట్టం చేయాలన్నారు. రద్దయిన జీవో నెం.3కు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కోరారు. నాయకులు నాగేశ్వరరావు, భాస్కరరావు, బుల్లెమ్మ, ఎ.రవి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టిసీమలో యోగా డే

పోలవరం, జూన్4(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ ఫెర్రీ రేవులో గురువారం కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో యోగాడే నిర్వహించనున్నట్టు మండల ప్రజా పరిషత్ అధికారి చెరుకూరి శ్రీనివాస్‌బాబు బుధవారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఈ యోగాడే కార్యక్రమంలో విధిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.



ఆకర్షణగా.. మే పుష్పం

ద్వారకాతిరుమల, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కనువిందుచేసే మే పుష్పం వికసించింది. ప్రతి ఏటా మేలోనే ఈ పుష్పాలు వికసించడం వీటి ప్రత్యేకత. ఇవి చూపరులను ఆకట్టుకుంటాయి. ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురానికి చెందిన టీడీపీ నేత పోలిన శ్రీనివాసరావు ఇంటి పెరటిలో ఈ పువ్వు బుధవారం విరబూసి ఆకర్షణీయంగా ఉంది. ఈనేపథ్యంలో మే పుష్పాన్ని చూసి స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

'భోజనం' తయారీలో రుచి, శుచికి ప్రాధాన్యమివ్వాలి

చాట్రాయి, జూన్ 4(ఆంధ్రజ్యోతి):పాఠశాలల మధ్యాహ్న భోజనం తయారీలో రుచి, శుచికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంఈవో బ్రహ్మచారి కోరారు. చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో బుధవారం మండలంలోని మధ్యాహ్న భోజనం తయారీదార్లు, హెల్పర్లకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఎంఈవో మాట్లాడుతూ మెనూ పాటించాలని, సమయానికి పాఠశాలకు వచ్చి ఆహారం తయారు చెయ్యాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ కుక్ లలితకుమారి (ఆగిరిపల్లి) వంటల తయారీ విధానంపై అవగాహన కల్పించారు.

నర్సరీ నుంచి గ్రామాలకు మొక్కలు

ముసునూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సరీ నుంచి గ్రామాలకు మొక్కలను తరలిస్తున్నట్టు ఎంపీడీవో సత్యనారా యణ, ఏపీవో రోజ్‌లీల తెలిపారు. బుధవారం ఫాతిమాపురం నర్సరీలో మొక్కలను అధికారులు పరిశీలించి, ట్రాక్టర్ల ద్వారా గ్రామాలకు మొక్కలను తరలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గురువారం పపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఒక్కొక్క గ్రామంలో 950 మొక్కలు చొప్పున 16 గ్రామాల్లో నాటేందుకు చర్యలు తీసుంటున్నట్లు ఆయన తెలిపారు.

వృద్ధులు, దివ్యాంగుల్లో ఆనందం


కాకరవాడలో ఇంటి వద్దే రేషన్ పంపిణీ

ముదినేపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): చౌక ధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులను తమకు ఇళ్ల వద్దే అంద జేస్తుండటంపై వృద్ధులు, దివ్యాంగుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది. వైసీపీ ఇంటింటికీ రేషన్ పేరుతో ఎండీయూ వాహనాల విధానాన్ని అమలు చేసిన సమయంలో కూడా వృద్ధులు, దివ్యాంగులు వాహనం వద్దకే ఎవరో ఒకరి సహాయంతో వెళ్లి బియ్యం తీసుకునేవాళ్లు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వారి ఇళ్ల వద్దే రేషన్ అందుకునే అవకాశం కల్పించింది. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇంటి వద్దే తీసుకునే విధానం మాదిరిగానే రేషన్ కూడా ఇంటికే వస్తుండటంతో దివ్యాంగుల్లో మరింత ఆనందం వ్యక్తమవు తున్నది. ముదినేపల్లి మండలంలో సుమారు 2 వేల మందికిపైగా వృద్ధులు, దివ్యాంగులు ఇళ్ల వద్దే రేషన్ తీసుకుంటున్నారు.

ఆయిల్ పామ్ రైతులకు మద్దతు ధర కల్పించాలి

ముసునూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ రైతులకు టన్నుకు కనీస మద్దతు ధర రూ. 22 వేలు పొందడానికి మే 31, 2025 నాటి కస్టమ్స్ సుంకం తగ్గింపు నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ఆయిల్ పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు కొసరాజు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం రైతులు, నాయకులు సంయుక్తంగా తహసీల్దార్ రమణకు వినతిపత్రం ఇచ్చారు. దిగుమతి సుంకాన్ని తగ్గించాలని తీసుకున్న నిర్ణయం వల్ల గత రెండు నెలల్లో పామాయిల్ ధర పడిపోయిందన్నారు. ఫలితంగా రైతులకు ఇచ్చే ఆయిల్‌పామ్ ధర భారీగా తగ్గిందన్నారు. తక్షణమే ప్రభుత్వం కస్టమ్స్ సుంకం తగ్గింపు నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకుని, ముడి వంట నూనెలపై 50 శాతం కస్టమ్స్ సుంకాన్ని తిరిగి విధించి, రైతుకు మద్దతు ధరను కల్పించాలని కోరారు. రైతులు సూర్యదేవర శ్రీనివాసరావు, జీవీ సుబ్బారావు, ఎస్.రాజేష్, బి.బాలకృష్ణ, ఎం.కృష్ణార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉంటాం

నూజివీడు టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ చివరి బాధితుడికి న్యాయం జరిగే వరకు అసోసియేషన్ అండగా ఉంటుందనీ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. నూజివీడులో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీవీ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీ మేరకు సత్వరమే అగ్రిగోల్డ్ బాధితులకు డబ్బులు చెల్లించేలా అన్ని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, కృష్ణా జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గగన్, సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, ప్రజా నాట్యమండలి సభ్యుడు గని, సీపీఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహరావు, మడుపల్లి నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


స్కూల్‌ను ప్రారంభిస్తున్న తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

గ్రామాలకు చేరువలో ఇంటర్నేషనల్ స్కూల్ భేష్

నూజివీడు టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఆర్కిడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కృష్ణ వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ మండవ వెంకట బసవేశ్వరరావు సంయుక్తంగా ప్రారంభించారు. తుమ్మల ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఇంటర్నేషనల్ స్కూల్‌ను గ్రామీణ ప్రాంతాలకు కూడా చేరువ చేయడం అభినందనీయమని, గత 35 ఏళ్లుగా శ్రీ సిద్ధార్థ విద్యా సంస్థల నిర్వాహకులు సమాజానికి చేస్తున్న కృషిని కొనియాడారు. ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అన్ని సౌకర్యాలతో పాఠశాలను నిర్మించడం అభినందనీయమన్నారు. కృష్ణా వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎంవీ బసవేశ్వరరావు ప్రసంగించారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు, నూతక్కి వేణుగోపాలరావు, జనసేన నాయకుడు ముత్యాల కామేష్, సీపీఎం నాయకులు జి. రాజు, సీపీఐ నాయకుడు సీహెచ్ రామారావు, ఆర్కిడ్ ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మన్ మేడా మోహనరావు, డైరెక్టర్లు డాక్టర్ గొల్లపూడి రవిబాబు, మేడా శ్రీహర్ష, దీప్తి, పాఠశాల ప్రిన్సిపాల్ ఎంపీ రుక్మిణి, పట్టణ ప్రముఖులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

మేలైన వంగడాలను ఎంపిక చేసుకోవాలి



తామరకొల్లులో రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అందచేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కైకలూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వరి పంటల్లో ముంపులు తట్టుకునే మేలైన వంగడాలను ఎంపిక చేసుకోవాలని ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ కె. ఫణికుమార్ అన్నారు. బుధవారం కైకలూరు మండలం తామరకొల్లులో 50 శాతం సబ్సిడీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం రైతులకు సార్వా పంటలో వరి విత్తనాలు ఎంపిక చేసుకునే విధానాన్ని వివరించారు. మేలైన వంగడాలను ఎంపిక చేసుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చాన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా, ముంపునకు గురైనా పంట పాడవకుండా, రైతులకు నష్టం వాటిల్లకుండా ఉంటుందన్నారు. 50 శాతం సబ్సిడీపై ప్రభుత్వం విత్తనాలు అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నీటి సంఘాల అధ్యక్షులు గంగుల ఏసురాజు, సర్పంచ్ శివాజీ, కార్యదర్శి చంద్రశేఖర్, రైతులు పోతురాజు, తలారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475


చిత్తపూరులో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఫణిబాబు


కోరుకొల్లులో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న కూటమి నాయకులు


చనుబండలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


మట్టగుంటలో కూటమి నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న అంద్రాజు శ్రీనివాస్

కూటమి పాలన సువర్ణాధ్యాయం

కేక్ కట్‌చేసి, బాణసంచా కాల్చి నాయకుల సంబరాలు


అల్లూరులో టీడీపీ సంబరాలు


కైకలూరులో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుతున్న టీడీపీ నాయకులు


కైకలూరులో జనసేన బాణసంచా కాల్పులు

చాట్రాయి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలో కూటమి పాలన సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని నూజివీడు నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు అన్నారు. కూటమి పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా మండలంలోని చిత్తపూరు గ్రామంలో జనసేన ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయటంతో పాటు, భావితరాలకు బంగారు భవిష్యత్తు అందించటానికి పాటుపడుతున్నారని, ప్రజలందరూ రాజకీయాలకతీతంగా మద్దతు ఇవ్వాలని కోరారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

జగన్ మూర్ఖత్వానికి నిదర్శనం

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన రోజును, మాజీ సీఎం జగన్ వెన్నుపోటు దినం అనటం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనమని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు విమర్శించారు. కూటమి సర్కార్ కొలువుదీరి ఏడాదైన సందర్భంగా చనుబండలో బుధవారం టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా తీర్పును గౌరవించని జగన్‌కి రాజకీయాలలో కొనసాగే అర్హత లేదని, ఆయన మళ్ళీ అధికారంలోకి రావటం కల్ల అన్నారు. సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి సర్కార్ సంక్షేమానికి అభివృద్ధికి సమప్రాధాన్యత ఇస్తూ ఆదర్శపాలన అందిస్తున్నదని అన్నారు.

విధ్వంస పాలనతో అప్పులపాలు

కైకలూరు, జూన్4(ఆంధ్రజ్యోతి): వైసీపీ విధ్వంసన పాలనతో రాష్ట్రం అప్పుల పాలైందని, బాబాయ్ గొడ్డలి వేటును అడ్డుపెట్టుకుని జగన్ ముఖ్యమంత్రి అయి రాష్ట్రాన్ని అధ్వానంగా మార్చారని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరక్టర్ పీజేఎస్ మాల్యాద్రి అన్నారు. బుధవారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా కైకలూరు కోరుకొల్లు సెంటర్‌లో కేక్ కట్ చేసి విజయోత్సవాలు జరిపారు. అనంతరం జగన్‌రెడ్డి అరాచకాలను వివరిస్తూ ప్రచురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందని అన్నారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేసి అప్పుల ఊబిలో ఉంచారని అన్నారు. జగన్ పాలనలో రౌడీలను ప్రోత్సహించడమే కాక, గంజాయి రవాణా విచ్చలవిడిగా పెరిగిపోయిందని, వెన్నుపోటు అంటూ ప్రకటలు చేస్తున్నారని ప్రజలు గమనించి తిప్పికొట్టాలన్నారు. మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఎండీ జానీ, నీటి సంఘం అధ్యక్షుడు గంగుల ఏసురాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పడమటి వాసు, ప్రధాన కార్యదర్శి బాజానీ, మైనార్టీ నాయకులు ఎండీ ఉస్మాన్, ఎస్. బషీర్, మాజీ ఎంపీటీసీ గంగుల శ్రీదేవి, పైడిమర్రి రాధాకృష్ణ, ఎస్సీ సెల్ నాయకుడు వీరాబత్తిన సుధ, యాదవ సంక్షేమ సభ్యుడు తలారి రాజేష్, ఎన్టీఆర్ ఫ్యాన్స్ నాయకులు లక్కింశెట్టి మోహన్, వేగిరెడ్డి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూరైన సందర్భంగా కైకలూరు జనసేన పార్టీ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద ముగ్గుల పోటీలను నిర్వహించారు. జనసేన నాయకులు కొల్లి వరప్రసాద్, తులసి పూర్ణా, సాయి తదితరులు పాల్గొన్నారు.

జనసేన సంబరాలు..

కలిదిండి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూరైన సందర్భంగా కోరుకొల్లులో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, కోరుకొల్లు సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ ఆధ్వర్యంలో కూటమి నాయకులు సంబరాలు నిర్వహించారు. రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆనందోత్సాహాలతో బాణాసంచా కాల్చారు. కూటమి నాయకులు వలవల వెంకట రామారావు, నున్న సుబ్రహ్మణ్యం, ఆమజాల బాబులు, వలవల రమేష్, నల్లగోపుల చలపతిరావు, బెల్లంకొండ వెంకన్నబాబు, తోట లక్ష్మణ్, కేశిరెడ్డి శ్రీనివాసరావు, బట్టు మహేష్‌లు పాల్గొన్నారు.

వెన్నుపోట్లు గొడ్డలి వేట్లు జగన్‌కే చెల్లు

వెన్నుపోట్లు గొడ్డలి వేట్లు జగన్‌కే చెల్లు అని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మట్టగుంటలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన సందర్భంగా కూటమి నాయకులతో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ వెన్ను పోటు దినం పేరిట చేసే కార్యక్రమాలను చూసి రాష్ట్ర ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. కూటమి నాయకులు తిరుమాని గోపాలకృష్ణ, మోకా రాంబాబు, పరశురాముడు, గణపతి, చిన్ని కృష్ణ, నాగరాజు, వెంకటేశ్వరరావు, రాంబాబు, శంకర్, తాతారావు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం గెలిచిన రోజు

ముదినేపల్లి: అల్లూరులో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగరాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మందుగుండు పేల్చి ప్రజాస్వామ్యం గెలిచిన రోజుగా అభివర్ణిస్తు విజయోత్సవం జరిపారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను కూడా విజయవంతంగా అమలు చేస్తున్నదని నాయకులు పేర్కొన్నారు. పార్టీ నాయకులు దాసరి శ్రీను, శీలం సురేష్‌బాబు, కాసాని బాల యేసు, వర్రె శశిధర్, బర్ల రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


పార్టీ నాయకులతో వేణు

టీడీపీ ఆరిగిపల్లి మండల అధ్యక్షుడిగా వేణు

ఆగిరిపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆరిగిపల్లి మండల టీడీపీ అధ్యక్షుడిగా నక్కనబోయిన వేణు ఎన్నికైనట్లు పార్టీ నాయకులు తెలిపారు. నూజివీడు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆరిగిపల్లి మండల పార్టీ కమిటీ ఎన్నిక నిర్వహించగా పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, మహిళలంతా ఏకగ్రీవంగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వేణుని పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్టు తెలిపారు. పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీబీ ప్రత్యేక స్క్రీనింగ్ క్యాంప్

ముసునూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేట పీహెచ్‌సీ పరిధిలో సోమవారం గ్రామంలో టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా బుధవారం ప్రత్యేక స్క్రీనింగ్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ కరీముల్లా, డాక్టర్ ఎస్. రమ్య 35 మందికి టీబీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించి, క్షయ లక్షణాలపై వివరించారు. వైద్యులు మాట్లాడుతూ టీబీ ముక్త భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమంలో బీపీ, షుగర్, మద్యపానం, ధూమపానం చేసేవారికి స్క్రీనింగ్ పరీక్షలను చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంప్‌లో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనం పర్యావరణ హితం

పర్యావరణం అనగానే పచ్చదనం మదిలో మెదులుతుంది. సకల జీవ రాశుల మనుగడ పర్యావరణంపై ఆధారపడి ఉంది. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణం పరిరక్షించుకోవచ్చు. ఆధునిక జీవనశైలితో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతున్న నేపథ్యంలో స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు మొక్కల పెంపకం చేపడతున్నారు. నేడు ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా..


ముదినేపల్లిలో వెంకటేశ్వరరావు ఇంటి ఆవరణలో పెంచిన మొక్కలు

● పచ్చని యార్లగడ్డ కుటుంబం

ముదినేపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంప కంతో ముదినేపల్లిలోని ఓ కుటుంబం పచ్చదనం పెంచుతోంది. ఇంటి ఆవరణతో పాటు పరిసరాల్లో వివిధ రకాల మొక్కలు నాటారు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతులు. ఇంటి ఆవరణ చెట్లు, మొక్కలతో ఆహ్లాద కరంగా ఉంటుంది. బయట కూడ నీడనిచ్చే మొక్కలు, అందమైన పుష్పాల మొక్కలను పెంచారు. వారి ఇంటికి వెళ్లగానే నర్సరీలో ఉన్న అనుభూతి కలుగుతుంది.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్

హామీల అమలేదీ : మేకా ప్రతాప్

నూజివీడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లు చెబుతూ హామీలు అమలు చేయకుండా కాలక్షేపం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆరోపించారు. బుధవారం వైసీపీ అధిష్ఠానం పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిర్వహించారు. ర్యాలీ నిర్వహించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగులకు భృతి ఏదంటూ నిలదీశారు. పది నెలల క్రితం పట్టణంలోని పెద్ద చెరువుకు నాలుగు గండ్లు పడితే ఇంత వరకు వాటిని పూడ్చలేదని, గండ్లు పూడ్చకపోతే త్వరలోనే ప్రజా ఉద్యమం చేయాల్సి వస్తుందన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏవో ఉదయబాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు.

పంచ తంత్ర కథల పఠనం

ముదినేపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా బుధవారం ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులతో పంచతంత్ర కథలు చదివించారు. అనంతరం పలు ఆటల పోటీలు నిర్వహించారు.

ప్రభుత్వాస్పత్రి తనిఖీ

కైకలూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించాలని ఎంపీడీవో ఆర్. ఫణీంద్ర అన్నారు. బుధవారం శీతనపల్లి పీహెచ్‌సీని తనిఖీ చేసి రోగులను అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రతి రోజూ ఆసుపత్రిలో ఓపీ వివరాలు తెలుసు కున్నారు. ఈవోపీఆర్‌డీ కొండలరావు, వైద్యాధికారిణి అనుపమ తదితరులు పాల్గొన్నారు.





ఆగిరిపల్లిలో యోగాసనాలు చేస్తున్న చిన్నారులు.. చాట్రాయి పోలీసు స్టేషన్‌లో యోగాభ్యాసం

చిన్నారులకు యోగా పోటీలు

ఆగిరిపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం చిన్నారులకు యోగాంధ్ర మండల స్థాయి పోటీలు ఎంపీడీవో బి. భార్గవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆగిరిపల్లి, వడ్లమాను, శోభనాపురం గ్రామాల నుంచి చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. గ్రూప్ యోగా, డ్రాయింగ్, స్కిట్, ఎస్సే రైటింగ్ చిన్నారులు తమ ప్రతిభను కనబరిచారని తెలిపారు. విజేతలుగా నిలిచిన చిన్నారులు జిల్లా స్థాయిలో జరిగే యోగా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. యోగా ట్రైనర్ బి. సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

చాట్రాయి: యోగాతో మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం పొందటం ద్వారా వృత్తి జీవితంలో మంచి ఫలితాలు సాధించవచ్చునని ఎస్ఐ డి. రామకృష్ణ అన్నారు. జూన్ 21 ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు యోగాసనాలు వేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యోగా ప్రాముఖ్యతను తెలుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నెల రోజుల పాటు జరిగే యోగాంధ్ర కార్యక్రమంలోఅందరై భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



విజేతలైన చిన్నారులతో ఎంపీడీవో

అంగన్‌వాడీ కేంద్రాలపై నిరంతర నిఘా

(ఐదో పేజీ తరువాయి)

తీరిన వారున్నట్టు ఇటీవల లెక్క తేల్చారు. ఉమ్మడి రాష్ట్రాల పరిధిలో ఎల్ఐసీ సంస్థతో అప్పట్లో ఒప్పందాలు జరిగాయి. ఉన్నతస్థాయిలో దీనిపై చర్చలు సాగుతున్నాయి. దీనికి కొంత సమయం పడుతుంది.

- తోటగొందిలో అంగన్‌వాడీ టీచర్ పోస్టు భర్తీకి ఓపెన్ టెస్ట్ పూర్తి చేసిన అభ్యర్థినిని ఎంపిక చేశారు. డిగ్రీ చేసిన అభ్యర్థిని ఉండగా ఆమెకు పోస్టు ఇవ్వలేదు.

- సలాది సూర్యచంద్రరావు,మాజీ సర్పంచ్

ఐసీడీఎస్ పీడీ: ఆ రోజు ఇంటర్వ్యూ నేను కూడా చేశాను. ఇంటర్వ్యూలో మార్కులు ఆధారంగా పోస్టు భర్తీ చేశాం.పిల్లలకు సరిగ్గా చెప్పగలరా, స్థానికంగా ఉంటారా? అన్నది చూసే ఎంపికచేశాం.

- కిశోర బాలికల ఆరోగ్యంపై ఐసీడీఎస్ నుంచి అమలు చేసే కార్యక్రమాలేమిటి.

- నాగమణి,కామవరపుకోట

ఐసీడీఎస్ పీడీ : 11 నుంచి 18 ఏళ్లలోపు వారిని కిశోర బాలికల కింద పరిగణనలోకి తీసుకుని, వారికి జిల్లా వైద్యఆరోగ్యశాఖ ద్వారా వ్యక్తిగత శుభ్రత, రక్తహీనత నివారణకు మందులు పంపిణీతో అవగాహన కార్యక్రమాలు ఈనెల 10 వరకు నిర్వహిస్తాం. జిల్లాలో 21,281 మందికి ఎంపిక చేశాం.

- కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లో బాల్యవివాహాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

- మేఘన, సోషల్ వర్కర్, కైకలూరు

ఐసీడీఎస్‌పీడీ : ఈ ఏడాదిలో జనవరి నుంచి ఇప్పటి వరకు 90కు పైగా బాల్య వివాహాలను జిల్లా బాలల సంరక్షణాధికారి పర్యవేక్షణలో చైల్డ్‌మ్యారేజ్ ప్రొహిబిషన్ ఆఫీ సర్లు అడ్డుకున్నారు.

- చింతలపూడి నామవరం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సరుకులకు నాణ్యమైనవి ఇవ్వడం లేదు. ఎంతెంత పరిమాణంలో ఇస్తున్నారో చెప్పడం లేదు.

- అశోక్, నామవరం

ఐసీడీఎస్ పీడీ : ఒకసారి సీడీపీవో ద్వారా వివరాలను తెలుసుకుని, చర్యలు తీసుకుం టాను. సరుకుల పంపిణీ వివరాలను నోటీసు బోర్డులో పెట్టిస్తాం.